TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

బుధవారం, సెప్టెంబర్ 09, 2026 | సంపుటి - 20 | సంచిక 340 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

గణేశ్ మండపాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్

హైదరాబాద్ : గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ స్పష్టం చేశారు. గణేశ్ మండపాల వివరాలను ఉత్సవ నిర్వాహకులు ముందస్తుగానే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

తరువాయి 2లో

కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే

సామాన్యులకు ఊరట కల్పించేలా చర్యలు

వచ్చే వారం నుంచి రైతు బజార్లలో లభ్యం

ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు

2లో

అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సోషల్ మీడియాను యాక్టివ్‌గా వాడాలి

టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం

అమరావతి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లా డుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంత మంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగి స్తున్నారు?" అని ప్రశ్నించారు.

2లో

మరిన్ని రూట్లలో నైట్ షిఫ్ట్ బస్సు సర్వీసులు

తెలంగాణ రాష్ట్ర టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, అర్ధరాత్రి వేళల్లో ప్రజా రవాణాకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని టి.జి.ఎస్.ఆర్టీసీ ప్రారంభించిన రాత్రిపూట బస్సు సర్వీసులకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రయాణికుల విజ్ఞప్తులు, రాత్రిపూట అధిక ట్రాఫిక్ రద్దీ, ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని 2026 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో ఆరు ప్రధాన రూట్లలో రాత్రిపూట ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తెచ్చారు. అబిడ్స్, లక్డికాపూల్, కేర్ హాస్పిటల్, అన్నపూర్ణ, ఉషాకిరణ్, గుట్లబేగంపేట్, కొండాపూర్ క్రాస్ రోడ్, హఫీజ్‌పేట్, లింగంపల్లి,

తరువాయి 2లో

శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్ : తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు.

2లో

ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై యూకే కఠిన చర్యలు

ఇజ్రాయెల్‌కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ : అంతర్జాతీయ వేదికపై ఇజ్రాయెల్‌కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లతో వాణిజ్య సంబంధాలపై బ్రిటన్ (యూకే) ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ సెటిల్‌మెంట్ల నుంచి వచ్చే అన్ని రకాల వస్తువుల దిగుమతితో పాటు ఫైనాన్సింగ్, నిర్మాణ రంగం వంటి సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బ్రిటన్ తీసుకున్న ఈ కీలక నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా సైతం మద్దతు ప్రకటించడమే కాకుండా, తాము కూడా ఈ నిషేధంలో భాగస్వామ్యం పంచుకోనున్నట్లు వెల్లడించాయి. వెస్ట్ బ్యాంక్‌లోని పలు

బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ : తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా

చావు రాజకీయాలు చేయిస్తారా?

కేసీఆర్‌ను అంతమొందించేందుకు కుట్ర

కేసీఆర్ నివాసం ముట్టడి రేవంత్ ఆలోచనే

బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్ :

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతికంగా అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు. "వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు.

ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

అక్సాయ్‌చిన్‌కు పశ్చిమాన భారత్, తూర్పున చైనా

ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్‌లో ప్రత్యక్షం..!?

న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన కొత్త ప్రపంచ పటం మరోసారి చర్చనీయాంశంగా మారింది. 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపిన నేపథ్యంలో వెలువడిన ఈ మ్యాప్‌లో అరుణాచల్‌ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను భారత్, చైనా వాదిస్తున్న సరిహద్దుల మధ్య ప్రత్యేక ప్రాంతాలుగా చూపించారు. అక్సాయ్‌చిన్‌ను లడఖ్‌లో భాగంగా భారత్ పేర్కొంటున్న విషయం తెలిసిందే. ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానంపై చర్చలు జరుగుతున్న సమయంలో జులై 1న ఈ మ్యాప్‌ను తొలిసారి విడుదల చేశారు. ఇందులో అరుణాచల్‌ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న

2లో

గణేశ్ మండపాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నిర్వాహకులు పోలీస్‌పోర్టల్. టిఎస్‌పోలీస్.జిఓవి.ఇన్/ ఇన్‌డెక్స్.హెచ్‌టిఎం పోర్టల్‌ను సందర్శించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అధికారిక పోర్టల్ ద్వారా సమాచారం అందించి హైదరాబాద్ సిటీ పోలీస్ కు సహకరించాలని కోరారు. మండపాల ఏర్పాటు, నిమజ్జన వివరాలు ముందుగానే తెలిస్తే ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, తగిన భద్రతాను పోలీసులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే

పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

'అన్నది నా తల్లిని.. నీ తల్లిని కాదు'..

హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం

హైదరాబాద్: శాసన సభాపతిని బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించిన ఘటనపై మంగళవారం శాసనసభలో జరిగిన తీవ్ర వాగ్వాదంలో స్వయంగా సభాపతి ప్రసాద్‌కుమార్ బిఆర్ఎస్ శాసనసభ పక్ష నేత హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ సభ్యులు 'అన్నది నా తల్లిని – నీ తల్లిని కాదు', నా గురించి నోటికొచ్చినట్లు మాట్లాడిన మీ సభ్యుల గురించి మీరేం సమాధానం చెబుతారని నిలదీశారు. అన్నది తన తల్లినని, హరీశ్‌రావు తల్లిని కాదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడికి సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని ఇప్పటికే చెప్పామని, ఇప్పటికీ తాము అదే చెబుతున్నామని స్పీకర్ అన్నారు.పోలీసు ఎస్కార్ట్‌తో ఎర్రవల్లి ఫాంహౌస్‌పై దాడికి యత్నం: జగదీష్ రెడ్డి ాూఙజవతీఅంవఎవత్ అయితే అంతకు ముందు హరీశ్ రావు ఆవేశంతో మాట్లాడుతూ స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల తాతా మధు ఇప్పటికే విచారం వ్యక్తం చేశారని అయినా అరెస్ట్ చేశారని వాపోయారు. సునీత చీరలాగడం, సబితా ఇంద్రారెడ్డి మెడ పట్టుకోవడంపై హరీష్ రావు తీవ్రంగా స్పందిస్తూ ఈ ఘటనలకు బాధ్యులపై చర్యలు తీసుకోరా ? అని మండిపడ్డారు. జరిగిన దాడికి సంబంధించి ఇంకా చర్యలు తీసుకోలేదని అన్నారు. ముగ్గురు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై కేసు పెట్టారని పేర్కొన్నారు. గౌరవ సభ కౌరవసభగా మారిందని మండిపడ్డారు. దీంతో భావోద్వేగానికి గురైన స్పీకర్ ప్రసాద్ కుమార్ స్పందిస్తూ మహిళా సభ్యులంటే సభతో పాటు తనకు కూడా గౌరవం అన్నారు. మీరు చెబితే నేను వినట్లేదా? తాను మాట్లాడుతుంటే మీకు ఎందుకంత ఆవేశమని హరీశ్‌రావును ఆగ్రహంతో ప్రశ్నించారు. మరిన్ని కనుగొనండి వార్తల సబ్‌స్క్రిప్షన్ ఇ–పేపర్ యాక్సెస్ వార్తాపత్రిక సబ్‌స్క్రిప్షన్ాూశ్రీంశీ =ఝుస – బీఆర్ఎస్ దాడిలో గాయపడిన మహిళా పోలీసులకు మంత్రి సీతక్క పరామర్శ 'మీకు కాదు ఆవేశం నాకు ఉండాలి, మీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నార'ని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మిపట్ల తనకు గౌరవం ఉందని అన్నారు. వారికి జరిగిన అసౌకర్యానికి నివేదిక కావాలని ఆదేశించినట్లు తెలిపారు. రిపోర్టు రాగానే దానికి సంబంధించిన చర్యలు తీసుకుంటామని హరీశ్ రావుకు సమాధానం ఇచ్చారు. మహిళా శాసనసభ్యులంటే సభతో పాటు తనకు కూడా గౌరవం ఉందన్నారు. అలాగే తనను అన్న మాటకు ఏం సమాధానం చెప్తావ్ హరీష్ అంటూ నిలదీశారు. సభలో ఎందుకంత ఆవేశపడుతున్నారని నిలదీశారు. నిజానికి తన తల్లిని దూషించారని, తనకు ఆవేశం ఉండాలి కానీ.. నువ్వెందుకు ఆవేశపడుతున్నావంటూ మండిపడ్డారు. అలాగే తన తల్లిని దూషించిన దానికి సమాధానం చెప్పు హరీష్ రావు అంటూ నిలదీశారు. ఈ అంశంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుంది.

డీఎస్సీలో అక్రమాలు జరిగాయి

లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్

అమరావతి,సెప్టెంబర్8 : ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని, దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్ చేశారు. విజిలెన్స్ విచారణ జరుగుతోందని అధికారులు చెప్పారని... దీని అర్థం డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెప్పడమే అని అన్నారు. విజిలెన్స్ పేరుతో కాలయాపన చేయకుండా ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటకు తీసేందుకు సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటా కింద కేటాయించిన 382 ఉద్యోగాలను ఎవరికి ఇచ్చారో పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని మార్గాని భరత్ నిలదీశారు. జూడో అసోసియేషన్ ఛైర్మన్‌గా ఉన్న లోకేశ్ తోడల్లుడు శ్రీభరత్ పైనా ఆరోపణలు చేస్తూ... పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమాలు జరిగాయని విమర్శించారు. అసెంబ్లీని, ప్రజలను పచ్చి అబద్ధాలతో తప్పుదోవ పట్టించిన లోకేశ్ కి జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. "లోకేశ్ ఎమ్మెల్యే కాకముందే నేను ఎంపీగా గెలిచాను. డీఎస్సీ అక్రమాలపై లోకేశ్ తో ఎక్కడైనా చర్చకు నేను సిద్ధం. కరకట్ట నివాసమైనా, హైదరాబాద్ ఇల్లయినా తేదీ, సమయం ఆయనే ప్రకటించాలి" అని బహిరంగ సవాల్ విసిరారు.

మరిన్ని రూట్లలో నైట్ షిఫ్ట్ బస్సు సర్వీసులు

రామచంద్రాపురం, బీరంగుడి మీదుగా పటాన్‌చెరు వరకు సర్వీసులు.. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ రాత్రిపూట సర్వీసుల్లో కేవలం ఏడు రోజుల్లోనే 9,286 మంది ప్రయాణికులు ప్రయాణించారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్ధరాత్రి వేళల్లో కూడా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో హైదరాబాద్ మహానగర ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజల నుంచి మరిన్ని కొత్త రూట్లలో రాత్రిపూట బస్సు సర్వీసులు ప్రారంభించాలంటూ విజ్ఞప్తులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రయాణికుల డిమాండ్లను, రద్దీని, రూట్ల అవసరాలను అధికారులు సమగ్రంగా పరిశీలించి భవిష్యత్తులో మరిన్ని ప్రధాన మార్గాల్లో థర్డ్ షిఫ్ట్ సర్వీసులను విస్తరిస్తామని వెల్లడించారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసి, హైదరాబాద్ నగరంలో 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థను దశలవారీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ప్రత్యేక ప్రాంతాలుగా అరుణాచల్, అక్సాయ్‌చిన్

సరిహద్దును తొలగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చూపిస్తూ.. పశ్చిమాన అసోం, ఉత్తరాన చైనా సరిహద్దుగా ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. అదే విధంగా అక్సాయ్‌చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. దాని పశ్చిమ వైపు భారత్, తూర్పు వైపు చైనా సరిహద్దులు ఉన్నట్లు మ్యాప్‌లో పేర్కొన్నారు. ఈ మార్పులు ఎందుకు చేశారన్న దానిపై ఐరాస ఎలాంటి వివరణ ఇవ్వలేదు. జమ్మూ కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్ఓసీ)ని కూడా మ్యాప్‌లో చుక్కల రేఖతో చూపించారు. దీనిపై మ్యాప్ కింది భాగంలో ఐరాస వివరణ ఇచ్చింది. భారత్, పాకిస్థాన్ అంగీకరించిన జమ్మూ కశ్మీర్ ఎల్ఓసీని ఈ చుక్కల రేఖ సుమారుగా సూచిస్తుందని పేర్కొంది. జమ్మూ కశ్మీర్ తుది స్థితిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా అంగీకారం కుదరలేదని తెలిపింది. ప్రపంచంలోని ప్రాంతాలను పటాల్లో మరింత కచ్చితంగా, సమానత్వంతో చూపించాలంటూ ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో తీసుకొచ్చిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం గత వారం ఆమోదించింది. ముఖ్యంగా ఆఫ్రికా ప్రాంతాల భౌగోళిక చిత్రణను మరింత సమానంగా చూపించడమే దీని లక్ష్యం. ఈ తీర్మానం చట్టబద్ధంగా అమలు చేయాల్సినది కాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా బహుళపక్ష సంస్థలు ఉపయోగించే ప్రామాణిక ప్రపంచ పటాల్లో దీనికి అనుగుణంగా మార్పులు చేసే అవకాశం ఉంది. ఆఫ్రికన్ గ్రూప్ తరపున టోగో ఈ తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లింది. భారత్ దీనికి మద్దతు తెలిపింది. సమాన విస్తీర్ణాన్ని ప్రతిబింబించే పటాల రూపకల్పన అనే మౌలిక సూత్రానికి మద్దతుగా తాము ఓటు వేసినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఏదైనా నిర్దిష్ట పటం, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణకు ఈ తీర్మానం ఆమోదం కాదని స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారత సార్వభౌమ భూభాగాన్ని అధికారిక భారత పటం ప్రకారమే చూపించాలని పేర్కొంది. తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణను అంగీకరించబోమని తెలిపింది.

స్కూల్ బస్సులో అకస్మాత్తుగా మంటలు

విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం

హైదరాబాద్,సెప్టెంబర్8 : తెల్లాపూర్‌లోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సులోకి విద్యార్థులు ఎక్కుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో తీవ్ర కలకలం రేగింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే పిల్లలను బస్సుకు దూరంగా తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. ఒకటో తరగతి విద్యార్థులు బస్సు ఎక్కుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం. క్షణాల్లోనే మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుంది. పరిస్థితిని గమనించిన సిబ్బంది వెంటనే స్పందించి విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తప్పించుకున్నారు. అయితే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా కాలిపోయి బూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ బస్సుల నిర్వహణ, ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలపై పాఠశాల యాజమాన్యం మరింత శ్రద్ధ పెట్టాలని కోరుతున్నారు. బస్సు సరైన కండిషన్‌లో లేకపోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గతంలోనూ ఇదే పాఠశాలకు చెందిన మరో బస్సు మంటల్లో దగ్ధమైన ఘటన జరిగిందని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలోని అన్ని బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మంటలు చెలరేగిన సమయంలో బస్సులో విద్యార్థులు ఉండి ఉంటే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదృష్టవశాత్తూ పిల్లలను వెంటనే బస్సు నుంచి దూరంగా తరలించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్కూల్ బస్సుల్లో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు అవసరమైన భద్రతా పరికరాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, అత్యవసర ద్వారాలు తదితర ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అనే అంశంపైనా ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనకు అసలు కారణం ఏమిటి? బస్సు ఫిట్‌నెస్ సక్రమంగా ఉందా? గతంలోనూ ఇలాంటి ఘటన జరిగిందన్న తల్లిదండ్రుల ఆరోపణల్లో వాస్తవం ఎంత? అనే అంశాలపై సంబంధిత అధికారులు, పాఠశాల యాజమాన్యం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణపై అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నగరంలో మరో భారీ ఫ్లైఓవర్..

బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలి మధ్య నిర్మాణం!

బిడ్లు స్వీకరిస్తున్నట్టు తెలిపిన అధికారులు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో కీలక ప్రాంతమైన ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు హెచ్ఎండీఏ ఒక కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మించబోతోంది. ఈ కొత్త కారిడార్‌ను బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు నిర్మించనున్నారు. తాజాగా ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. అర్హులైన కాంట్రాక్టర్లు ఈ నెల 22 లోపు బిడ్లు దాఖలు చేయాలని పేర్కొంది. టెండర్లు ఖరారయ్యాక నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. ఈ కొత్త కారిడార్‌ను బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గచ్చిబౌలిలోని శిల్పా లేఅవుట్ వరకు దాదాపు 9 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి హెచ్ఎండీఏ దాదాపు రూ.1,656 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ కారిడార్ నిర్మాణాన్ని మొత్తం రెండు దశల్లో పూర్తి చేసేలా అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. మొదటి దశలో ఫిలింనగర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కి.మీ మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఇక రెండో దశలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హకీంపేట్ కుంట వరకు 4 కి.మీ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఈ కారిడార్ నిర్మాణం పూర్తయ్యాక రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దీనిపై దాదాపు ఆరు ర్యాంప్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఫిలింనగర్ రోడ్డు నం. 82 వద్ద, నార్నే రోడ్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 52, ఐటీసీ కోహినూర్ రోడ్, టీ–హబ్ జంక్షన్, మైండ్‌స్పేస్ వద్ద ఈ ర్యాంప్‌లను నిర్మించనున్నారు. అంతేకాదు, రాబోయే రోజుల్లో ఈ రూట్‌లో మెట్రో రైలు విస్తరణ జరిగినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ కారిడార్‌ను డిజైన్ చేశారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తై అందుబాటులోకి వస్తే ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీ చెక్‌పోస్టు, ఫిలింనగర్ మీదుగా వెళ్లే వారికి భారీ ఊరట లభించనుంది. దీనివల్ల ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. అలాగే నగర నడిబొడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్‌కు చేరుకోవడం మరింత సులభతరం కానుంది.

ప్రధాని పర్యటనలో తుపాకీ కలకలం

పీఎంవో అధికారినంటూ ఎంట్రీకి యత్నం

ముంబై,సెప్టెంబర్8 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రా–కుర్లా కాంప్లెక్స్ (లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ పాల్గొననున్న కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధానమంత్రి కార్యాలయం అధికారినని చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక వివరాల ప్రకారం, ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో ఈ ఇద్దరిని గుర్తించారు. నకిలీ గుర్తింపు కార్డుతో ఉన్న వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. అతనితో పాటు ఉన్న అంగరక్షకుడి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో గుర్తింపు కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా అది నకిలీదని తేలింది. నకిలీ గుర్తింపు కార్డును ఎలా సంపాదించాడు? తాను అధికారినని ఎందుకు చెప్పుకున్నాడు? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమం జరిగే ప్రదేశంలోకి ఎందుకు రావడానికి ప్రయత్నించారు? అనే అంశాలపై ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. అయితే, ప్రస్తుతానికి ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతో వారు అక్కడికి వచ్చినట్లు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ ఏడో ఎడిషన్‌లో ఫైనాన్స్ భవిష్యత్తు, ఏజెంటిక్ , టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితంపై చర్చలు జరగనున్నాయి. అంతకుముందు ప్రధాని గుజరాత్‌లోని వడోదరలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకిత కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో రూ.20,700 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లోని 326 రూట్ కిలోమీటర్ల మూడు కీలక విభాగాలు ఉన్నాయి.ప్రధాని ముంబై పర్యటనకు ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడటం భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేసింది. ఈ ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏంటన్నది క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

రెండో రోజూ నష్టాల బాటలో మార్కెట్లు

న్యూఢిల్లీ,సెప్టెంబర్8 : అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ జూన్ మధ్య నుంచి చూస్తే కనిష్ఠ స్థాయికి చేరాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలు మార్కెట్లపై మరింత ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 555.23 పాయింట్లు పతనమై 75,577.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 144.05 పాయింట్లు కోల్పోయి 23,635.10 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 0.73 శాతం, నిఫ్టీ 0.61 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు ఎక్కువగా పడిపోయాయి. మరోవైపు ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు కొంత మద్దతు ఇచ్చాయి. అయితే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం స్వల్ప లాభాలతో ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.21 శాతం, స్మాల్‌క్యాప్ 0.17 శాతం చొప్పున పెరిగాయి. చమురు ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే మార్కెట్‌లో ఒడుదొడుకులు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గత ఐదు, ఆరు నెలల్లో మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లు భారీగా రాణించడంతో ఇకపై వాటి జోరు కొనసాగడం కష్టమేనని అభిప్రాయపడుతున్నారు. పెద్ద కంపెనీల షేర్లు, ఈక్విటీ ఆధారితేతర ఈటీఎఫ్‌ల వైపు దృష్టి పెట్టడం సురక్షితమని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే రూపాయి విలువ కూడా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 0.29 శాతం క్షీణించి 94.81 వద్ద ట్రేడైంది. డాలర్ 98.95 సమీపంలో ఉండగా.. బ్రెంట్ క్రూడ్ ధర 97 డాలర్ల వద్ద కొనసాగింది.

శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై యూకే కఠిన చర్యలు

ప్రాంతాల్లో 'సెటిలర్ టెర్రరిస్టులు' పాలస్తీనియన్లపై జాతి నిర్మూలనకు పాల్పడుతున్నారని బ్రిటన్ విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబాండ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలస్తీనా ప్రజల ఇళ్లను కూల్చివేయడం, రహదారులు, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ సమాజం కళ్లముందే పాలస్తీనాలో జరుగుతున్న ఈ పరిణామాల పట్ల తాను సిగ్గుపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ఆండీ బర్న్‌హమ్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్ విషయంలో యూకే తన విదేశాంగ విధానంలో తీసుకొచ్చిన అతిపెద్ద మార్పుగా దీనిని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఏడాది బ్రిటన్ ప్రభుత్వం పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. బ్రిటన్ నిర్ణయంపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు తీవ్రంగా స్పందించాయి. ఇది 'తీవ్రమైన తప్పుడు అంచనా' అని, తమ ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ మండిపడ్డారు. "బ్రిటన్ మాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే, మేము కూడా బ్రిటన్‌కు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌లోని అమెరికా రాయబారి మైక్ హకబీ ఈ చర్యను 'యూదు ప్రజలపై చూపిస్తున్న వివక్ష'గా అభివర్ణించారు. దీనికి ప్రతిగా అమెరికా నుంచి ప్రతీకార చర్యలు ఉండవచ్చని ఆయన సంకేతాలిచ్చారు. ఈ ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో, బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సోమవారం ఫోన్లో మాట్లాడినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది.

బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్

తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

యూట్యూబర్ 'నందు'కు నోటీసులు..

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అడ్డుకున్న అధికారులు

హైదరాబాద్,సెప్టెంబర్8 : చీటింగ్ కేసుకు సంబంధించి యూట్యూబర్, 'నందూస్ వరల్డ్' యూట్యూబ్ చానల్ నిర్వాహకురాలు నందనకు సోమవారం నోటీసులు జారీ చేసినట్లు ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం 'బీబీసీ'తో చెప్పారు. యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసాలు రెన్యువల్ చేస్తామని పలువురిని మోసగించారంటూ నందన, ఆమె భర్త మధుకర్, ఆయన తండ్రి మోహన్ రావుపై గత ఏడాది నవంబర్‌లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుకు సంబంధించి అప్పట్లో లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం లండన్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన నందనని ఎయిర్‌పోర్ట్ ఇమిగ్రేషన్ పోలీసులు అడ్డుకుని ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం పంపించారు. వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని ఆమెకు 35 బీఎన్ఎస్ నోటీసులు అందించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రెండు రోజుల్లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆమెపై నమోదైన కేసులకు సంబంధించి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. నోటీసులు తీసుకుని ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ఆయన బీబీసీతో చెప్పారు. యూకేలో నివాసముంటూ యూట్యూబ్‌లో వీడియోలు చేసే గుంటూరుకి చెందిన రమానందన అలియాస్ నందు కుటుంబసభ్యులపై విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి గతేడాది నవంబర్‌లోనే కేసులు నమోదైప్పటికీ అనంతరం కూడా నందు కుటుంబసభ్యులపై పలు చోట్ల నుంచి మోసపూరిత ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తమ పీఎస్‌లో నమోదైన కేసు వివరాలను, వాటి పురోగతిని ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు 2026 జూన్ నెలలో బీబీసీకి తెలిపారు. విలక్షణమైన వాయిస్‌తో యూట్యూబర్‌గా సోషల్ మీడియాలో పాపులర్ అయిన నందు 'మన శంకర వరప్రసాద్' అనే సినిమాలోనూ నటించారు.

ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు
ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం

హైదరాబాద్,సెప్టెంబర్8 : తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు. కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

ఉత్తర కొరియా అమ్ములపొదిలో 'కాంగ్ కోన్'

విధ్వంసక నౌక నావికాదళంలోకి ప్రవేశం

న్యూఢిల్లీ,సెప్టెంబర్7 : ఉత్తర కొరియా తన నావికాదళాన్ని ఆధునికీకరించే ప్రణాళికల్లో భాగంగా మరో కీలక ముందడుగు వేసింది. అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యంతో నిర్మించిన 'కాంగ్ కోన్' అనే కొత్త డిస్ట్రాయర్ (విధ్వంసక నౌక)ను నావికాదళంలోకి ప్రవేశపెట్టింది. దేశ తూర్పు తీరంలోని ఓడరేవు నగరం వోన్సాన్‌లో జరిగిన ఈ నౌక ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. 5,000 టన్నుల బరువున్న ఈ కొత్త డిస్ట్రాయర్ కేవలం రక్షణ కోసమే కాదని, ఇది శత్రువులపై దాడి చేయగల సామర్థ్యం ఉన్న నౌక అని స్పష్టం చేశారు. "ఈ నౌక దేశ అణు ప్రతిచర్య వ్యవస్థలో ఒక భాగం. శత్రువుల నుంచి ముప్పు ఎదురైతే వారికి చావుదెబ్బ రుచిచూపించేలా ఇది ప్రతిదాడి చేస్తుంది" అని కిమ్ హెచ్చరించారు. దేశ నావికాదళాన్ని పూర్తిగా "అణు సాయుధ శక్తి"గా మార్చడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. నావికాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఒక ముఖ్యమైన ప్రణాళికను అమలు చేస్తున్నామని, దాని ఫలితాన్ని ఎనిమిది నెలల్లో ప్రపంచానికి చూపిస్తానని కిమ్ ప్రకటించారు. ఇది 2021లో ఉత్తర కొరియా ప్రకటించిన అణు జలాంతర్గాముల నిర్మాణానికి సంబంధించినది కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నూతన 'కాంగ్ కోన్' నౌకను ఉత్తర కొరియా నావికాదళంలోని ఈస్ట్ సీ ఫ్లీట్‌లో మోహరించనున్నట్లు అధికారిక మీడియా కేసీఎన్ఏ తెలిపింది. మూడు నెలల క్రితమే 'చోయ్ హ్యోన్' అనే ఇదే తరహా డిస్ట్రాయర్‌ను పశ్చిమ సముద్రంలో మోహరించిన ఉత్తర కొరియా, ఇప్పుడు 'కాంగ్ కోన్'ను తూర్పు సముద్రంలోకి దించడం ద్వారా తన రెండు తీరాల్లో అణు సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. ఈ కార్యక్రమానికి కిమ్ తన భార్య రి సోల్ జు, కుమార్తె జు ఏతో కలిసి హాజరయ్యారు. అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలు 'ఫ్రీడమ్ ఎడ్జ్' పేరుతో సైనిక విన్యాసాలు ప్రారంభించిన రోజే ఉత్తర కొరియా ఈ నౌకను ప్రారంభించడం గమనార్హం. ఈ విన్యాసాలు యుద్ధ సన్నాహక చర్యలేనని ఉత్తర కొరియా ఆరోపిస్తోంది. సెప్టెంబర్ 9న ఉత్తర కొరియా 78వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకోనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

యెమెన్‌లో మళ్లీ భగ్గుమన్న హింస..

న్యూఢిల్లీ : యెమెన్‌లో మళ్లీ హింస ప్రజ్వరిల్లింది. ప్రభుత్వ బలగాలకు, హౌతీ తిరుగుబాటుదారులకు మధ్య పశ్చిమ ప్రావిన్సులైన తాయిజ్, హోదైదాలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న భీకర ఘర్షణల్లో కనీసం 117 మంది మరణించారు. కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న యుద్ధ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కడంతో దేశంలో మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం మొదలవుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాలి.. రాజకీయ రచ్చకు వేదికగా మార్చొద్దు

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. అసెంబ్లీ రాజకీయ రచ్చకు వేదిక కాదని, తెలంగాణ రాష్ట్రానికి పుణ్యక్షేత్రం లాంటి శాసనసభ ప్రజాస్వామ్యానికి వేదిక అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించాల్సిన ప్రతిపక్షం ప్రతి అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదన్నారు. అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నిరసన తెలిపేందుకు నల్ల టీ-షర్టులతో రావద్దని పోలీసులు సూచిస్తే, టీ-షర్ట్ విప్పేసి బనియన్‌తో రావడం ఏ విధమైన రాజకీయ సంస్కారమని ప్రశ్నించారు. ఇన్నేళ్ల రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ ప్రజాప్రతినిధులు అసెంబ్లీ గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని సూచించారు. మంత్రిగా, సభా పక్ష నేతగా, సీనియర్ ప్రజాప్రతినిధిగా పనిచేసిన వారికి శాసనసభకు ఎలా రావాలి, సభలో ఎలా ప్రవర్తించాలి అనే కనీస అవగాహన ఉండాలని అన్నారు. పోలీసులతో ఎలా వ్యవహరించాలి, సభలో ఎలాంటి హుందాతనం పాటించాలి అనే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలు సహా ప్రజాప్రతినిధులందరూ ఉన్న సభలో బనియన్‌తో రావడం ద్వారా ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే హక్కులతో పాటు బాధ్యత కూడా ఉంటుందని జగదీశ్వర్ గౌడ్ అన్నారు. నిరసనతో పాటు హుందాతనం, రాజకీయంతో పాటు సంస్కారం ఉండాలని పేర్కొన్నారు. అసెంబ్లీని రచ్చబండగా మార్చడం రాజకీయ పోరాటం కాదని, చర్చకు బదులు చిల్లర ప్రదర్శనలు చేయడం ప్రతిపక్ష బాధ్యత కాదని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనసభను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త రఘునందన్ రెడ్డి, నాయకులు మహిపాల్ యాదవ్, సయ్యద్ గౌస్, కట్ల శేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు అలీ, జహంగీర్, బాష్పక యాదగిరి, నగేష్ నాయక్, శేఖర్ ముదిరాజ్, రవీందర్ రెడ్డి, హరికిషన్, అంతిరెడ్డి, పట్వారీ శశిధర్, యలమంచి ఉదయ్ కిరణ్, గంగల గణేష్ యాదవ్, అయాజ్ ఖాన్, పోచన్న, సయ్యద్ బాబా, లక్ష్మణ్, కృష్ణ, చిన్న, కార్తీక్ గౌడ్, నారాయణ, ప్రభాకర్, పద్మారావు, రవికుమార్ నాయి, సుధాకర్, రాజేష్, శంకర్ గౌడ్, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు నర్సింగ్ రావు, శామ్యూల్ కార్తీక్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జాకీర్, ప్రధాన కార్యదర్శి నరేందర్ ముదిరాజ్, మాజీ అధ్యక్షులు సౌందర్య రాజన్, సాజిద్, రషీద్, పరుశు రాం, యాదయ్య, యాదగిరి, ఇస్మాయిల్, జావేద్, ముజీబ్, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు పార్వతి, జయ, అనిత, తన్వీర్ బేగం, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు చంద్రమౌళి, రవికుమార్ గౌడ్, కిరణ్, సాయి కిషోర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి రామప్రభు చొరవ

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అట్టేపల్లి రామప్రభు చొరవ తీసుకున్నారు. మియాపూర్ పరిధిలోని ఎఫ్‌సీఐ, టీఎన్ నగర్, వైడియా కాలనీ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన ఆయా ప్రాంతాల్లో నెలకొన్న రోడ్ల దుస్థితిని స్వయంగా పరిశీలించారు. రోడ్లు అధ్వానంగా ఉండటంతో స్థానికులు, పాఠశాల విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని ఆయన గమనించారు. వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై బురద, గుంతలు ఏర్పడటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికులు రామప్రభు దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ద్విచక్ర వాహనదారులు సైతం జాగ్రత్తగా ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కాలనీల్లోకి చేరుకోవడం కూడా కష్టంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న రామప్రభు వెంటనే స్పందించారు. సమస్య పరిష్కారానికి సంబంధిత చర్యలు తీసుకోవడంతో పాటు, తక్షణ ఉపశమనంగా రోడ్లపై మోరం వేయించి చదును చేయించే పనులను చేపట్టారు. దీంతో రోడ్లపై ఏర్పడిన గుంతలు, అసమాన ప్రాంతాలను కొంతమేర సరిచేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తగ్గించేలా చర్యలు చేపట్టారు. ప్రజలు సమస్యను చెప్పినప్పుడు కేవలం హామీలు ఇవ్వడం కాకుండా, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు రామప్రభు తెలిపారు. రోడ్ల సమస్యకు తాత్కాలిక పరిష్కారంతో పాటు శాశ్వత పరిష్కారం అవసరమని, ఇందుకోసం సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపడితేనే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని, ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సదుపాయాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎఫ్‌సీఐ, టీఎన్ నగర్, వైడియా కాలనీ ప్రాంతాల్లో రోడ్లపై మోరం వేయించి చదును చేయించే చర్యలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను తమ దృష్టికి తీసుకుని వెంటనే స్పందించిన రామప్రభుకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇలాంటి చొరవ కొనసాగించాలని వారు కోరారు. ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉండి, స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చని రామప్రభు అన్నారు. ప్రజల సమస్య కనిపించినప్పుడు స్పందించడం మాత్రమే కాకుండా, సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపించడమే తన లక్ష్యమని తెలిపారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట

రిమాండ్ పిటిషన్ తిరస్కరణ
ఉదయం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి అరెస్ట్
నారాయణ గూడ పోలీస్ స్టేషన్ కు తరలింపు

హైదరాబాద్,సెప్టెంబర్8 : తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో భారీ ఊరట లభించింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పాటు విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా వ్యవహరించారనే అభియోగాలపై పోలీసులు.. ఇవాళ ఉదయం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే పోలీసులు కోరిన రిమాండ్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను మంగళవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని నాంపల్లి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండ్ కోరారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఇద్దరికీ వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించడంతో పాటు రెండు ష్యూరిటీలు ఇవ్వాలని ఆదేశించింది. అవసరమైన పూచీకత్తు, ష్యూరిటీలు సమర్పించిన తర్వాత వారిద్దరినీ విడుదల చేయాలని పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశించింది. దీంతో న్యాయపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎమ్మెల్సీలు విడుదల అయ్యారు. విచారణ సందర్భంగా అసెంబ్లీ వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన దృశ్యాలను అసెంబ్లీ లీగల్ టీమ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వాటిని పరిశీలించిన అనంతరం న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలు విన్నది. ఎమ్మెల్సీల తరఫు న్యాయవాదులు ఈ కేసులు రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా నమోదు చేశారని వాదించినట్లు తెలుస్తోంది. రిమాండ్‌ను తిరస్కరించి తమ క్లయింట్లను విడుదల చేయాలని కోర్టును కోరారు.అసెంబ్లీ వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి తెలంగాణ హైకోర్టులోనూ పరిణామాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని, ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారని.. ప్రభుత్వ వ్యతిరేక రాతలతో కూడిన నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారని అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరించినట్లు తెలుస్తోంది.

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణ లక్ష్మి అండ

రూ.1,00,116 ఆర్థిక సహాయం చెక్కు అందజేసిన ఆరెకపూడి గాంధీ

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని శాసనసభ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని హైదర్‌నగర్ డివిజన్ రామ్‌నరేష్ నగర్ కాలనీకి చెందిన శ్రీమతి గజ్జ హేమ, నరేందర్ రెడ్డిలకు మంజూరైన రూ.1,00,116 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద ఆర్థిక సహాయం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. నిరుపేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని గాంధీ తెలిపారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు సంతోషకరమైన వాతావరణంలో జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కల్యాణ లక్ష్మి చెక్కు అందుకున్న కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, ఆరెకపూడి గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుల రాజేందర్, శ్రీధర్ రెడ్డి, యాసిన్, దేవేందర్ రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిపై చర్యలేవి?

వారికి జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుంది
దాడిపై అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు
నీ తల్లికి కాదు మా అమ్మకు అవమానం జరిగింది
ఘాటుగా బదులిచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్

హైదరాబాద్,సెప్టెంబర్8 : బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ వద్ద జరిగిన అమానుష ఘటనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుందని హరీష్ రావు అన్నారు. అయితే అవమానం జరిగింది నీ తల్లికి కాదు, మా అమ్మకు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడిలో పోలీసులపై చర్యలను మంత్రి శ్రీధర్ బాబు పరిశీలిస్తామని అన్నారు. సబితక్క గొంతునొక్కారు, మగ పోలీసులు ఈ పని చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంటే.. దీనిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డిని చీర లాగి అవమానిస్తే.. ఆ పోలీసులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా వీరిపైనే కేసులు నమోదు చేసి వేధించడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి, వారిపై కేసులు నమోదు చేసి వేధించడంపై హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇది గౌరవసభ కాదని, కౌరవ సభగా మారిందంటూ మండిపడ్డారు. ఆనాడు కౌరవులకు పట్టిన గతే మీకు పడుతుందని, ఈ విషయాలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురించి మాట్లాడుతూ.. మీరంటే నాకు చాలా గౌరవం, చాలా ఇష్టం. చాలా ఏళ్ల నుంచి సభలో మీతో కలిసి పనిచేశాం. ఎమ్మెల్సీ తాతా మధు తాను స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ మీరు మిమ్మల్ని అన్నారని భావిస్తే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానంటూ విచారం వ్యక్తం చేశారు. మీ ప్రభుత్వానికి నిజంగానే ఎస్సీ, ఎస్టీలపై చిత్తశుద్ధి ఉంటే డిక్లరేషన్ ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయకుండా తాళం ఎందుకు వేశారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. మహిళా ప్రజాప్రతినిధులను ప్రభుత్వం గౌరవిస్తుంది. సభాధ్యక్షుడిగా నాకు కూడా గౌరవం ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అయితే మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టారని హరీష్ రావు ప్రస్తావించగా.. మీరు చెప్పింది మేం విన్నాం. మేం చెప్పింది కూడా వినండి. హరీష్ రావు మీకు కాదు, నాకు ఉండాలి ఆవేశం. వాళ్లు అన్నది నీ తల్లిని కాదు, నా తల్లిని అవమానించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మిలు నాకు సోదరిమణుల్లాంటి వారు. వారిపట్ల నాకు గౌరవం ఉంది. నా తల్లిని మాటలు అన్నారు, అనుచిత వ్యాఖ్యలు చేశారు దీనికి ఏం సమాధానం చెబుతావు హరీష్ రావు అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభలో గట్టిగానే ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద సోమవారం నాడు సభ్యుల తీరుపై మంత్రి సీతక్క అసెంబ్లీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని, స్పీకర్‌ను, ఆయన తల్లిని దూషించడం కరెక్టేనా అని నిలదీశారు. పోలీసులపై దాడి చేసిన, స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో రూల్స్ తెచ్చిన నేతలే వాటిని ఉల్లంఘిస్తూ అసభ్యకర భాషతో మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అయితే, తమ చీరలు లాగి కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. నిజంగా దాడి జరిగితే విచారించి బాధ్యులైన పోలీసులపై కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని సీతక్క స్పష్టం చేశారు.

సంపాదకీయం

రిటైర్మెంట్ కన్నా జడ్జీల అనుభవమే మిన్న

అనుభవజ్ఞులైన న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంవల్ల న్యాయపరమైన అనుభవం కోల్పోతున్నందున వారి పదవీ విరమణ వయస్సును పెంచడం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత అవసరమని సుప్రీం కోర్టు అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా జిల్లా న్యాయవ్యవస్థలో పదవీ విరమణ వయస్సును పెంచాలని సూచిస్తోంది. దేశం మొత్తం మీద పెండింగ్ కేసుల సంఖ్య ఐదు కోట్లు దాటిపోయిన నేపథ్యంలో సుప్రీం కోర్టు ఈ ప్రతిపాదన చేయడం ఆలోచించాల్సిందే. అలా చేయకపోతే ప్రజలకు సకాలంలో న్యాయం అందించడం ఒక భ్రమగా మిగిలిపోతుందని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరిస్తోంది. ఈ మేరకు జిల్లా న్యాయవ్యవస్థ లోని న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచే అంశంపై సుప్రీం కోర్టు ప్రయత్నాలు ప్రారంభించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించడం ప్రారంభించింది. ఈ విధంగా పదవీ విరమణ వయస్సును పెంచాలని సుప్రీం కోర్టు గట్టిగా పట్టుపట్టడానికి ప్రధాన కారణం న్యాయాధికారులు సాధారణ ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ వయసులో న్యాయ వ్యవస్థలోకి ప్రవేశిస్తారని, అందువల్ల వారిని ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో నేరుగా పోల్చడం సరికాదని అభిప్రాయపడింది. అనుభవజ్ఞులైన న్యాయాధికారులను కొనసాగించడం వల్ల కేసుల పెండింగ్ తగ్గిపోతుందని భావిస్తోంది. ఈ ఏడాది మార్చి 31న, ఆ తర్వాత రిటైరైన న్యాయాధికారులకు తిరిగి విధుల్లో చేరే అవకాశం కల్పించాలని, ఒకవేళ వారు ఇతర విధుల్లో చేరని పక్షంలో ఈ వెసులుబాటు వర్తింప చేయాలని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థకు సంబంధించి రాష్ట్రాల్లో నియామకాలు జరిగినప్పటికీ, మంజూరైన అన్ని పోస్టులూ భర్తీ కాలేదు. అందువల్ల ఉండాల్సిన సిబ్బంది సంఖ్యకు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యకు మధ్య పెద్ద తేడా కనిపిస్తోంది. జాడలేని చినుకు న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సు పెంపుపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు రాష్ట్రాలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం కోర్టు చేసిన ఈ సూచనలకు ఇప్పటివరకు కేవలం ఏడు రాష్ట్రాలు మాత్రమే సానుకూలంగా స్పందించాయి. మిగతా రాష్ట్రాలు ఈ విషయంలో సందేహంగా ఉండటం, ఆసక్తి చూపకపోవడం జరుగుతోంది. తెలంగాణ హైకోర్టు న్యాయాధికారుల రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని సిఫారసు చేయగా, తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తోంది. తమిళనాడు ప్రభుత్వం ఈ పెంపునకు అభ్యంతరం లేదని తెలియజేసింది. తమిళనాడు హైకోర్టు కూడా రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. అయితే 60 ఏళ్ల వయస్సులో సామర్థ్యం/అర్హతను పరిశీలించే ప్రక్రియ ఉండాలని సూచించింది. న్యాయాధికారుల పదవీ విరమణ వయసు పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, జమ్మూకశ్మీర్, తమ నిర్ణయంపై పునరాలోచన చేయాలని ధర్మాసనం కోరింది. ఈ రాష్ట్రాలు సంకోచించడానికి కారణం ఏమిటంటే ఈ పదవీ విరమణ వయసును పెంచడంవల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై పడే ఆర్థిక భారం గురించి అవి ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచితే రాష్ట్ర ప్రభుత్వ ఇతర శాఖల్లోని ఉద్యోగులు కూడా తమ పదవీ విరమణ వయసును పెంచాలని, సమానత్వం పేరుతో డిమాండ్ చేస్తారేమో అని ఆయా రాష్ట్రాలు భయపడుతున్నాయి. ఈ రాష్ట్రాలు వ్యక్తం చేసిన భయాందోళనలు పూర్తిగా తప్పుగా అర్థం చేసుకున్నవే అని కోర్టు వ్యాఖ్యానిస్తోంది. న్యాయమూర్తుల పదవీ విరమణ వయసును పెంచడంవల్లవారికి మరో రెండు లేదా ఐదు సంవత్సరాల పాటు వారి పే స్కేలులో గరిష్ఠ జీతం చెల్లించాల్సి రావచ్చు. అలాగే పదవీ విరమణ సమయంలో ఇవ్వాల్సిన ప్రయోజనాల ఖర్చు కూడా పెరగవచ్చు. కుటుంబ రాజకీయాలతో ఎన్నాళ్లీ కుంటినడక? దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై కొంత అదనపు ఆర్థిక భారం పడుతున్నప్పటికీ అనుభవజ్ఞులైన న్యాయాధికారులు మరికొంత కాలం పని చేయడంవల్ల న్యాయవ్యవస్థకు, సమాజానికి కలిగే ప్రయోజనం, ఆ ఖర్చుతో పోలిస్తే చాలా ఎక్కువ. రిటైర్మెంట్ వయస్సు 60 ఏళ్లుగా ఉంటే పాత న్యాయాధికారులకు రిటైర్మెంట్ ప్రయోజనాలు చెల్లించడంతోపాటు కొత్త వారిని నియమించి వారికి జీతాలు కూడా ఇవ్వాల్సి వస్తుంది. దీనివల్ల ప్రభుత్వంపై రెండు రకాల ఆర్థిక భారం పడుతుంది. కానీ రిటైర్మెంట్ వయస్సును 62కు పెంచితే అనుభవజ్ఞులైన అధికారులు మరో రెండు సంవత్సరాలు పని చేస్తారని, అందువల్ల వారి రిటైర్మెంట్ తర్వాత చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం తర్వాత చెల్లించవచ్చని, తద్వారా తక్షణ ఆర్థిక భారం తగ్గుతుందని కోర్టు చెబుతోంది. స్వతంత్రంగా, సమర్థవంతంగా పని చేయగల న్యాయాధికారులను నియమించడం చాలా కష్టమైన పని. వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన చాలా నియామక ప్రక్రియలు ఆశించిన స్థాయిలో ఫలితాలను సాధించలేకపోయాయి. మద్రాస్ హైకోర్టుతోసహా కొన్ని హైకోర్టులు పదవీ విరమణ వయస్సు పెంపును అనర్హులైన, లేదా పనితీరు సరిగ్గా లేని న్యాయాధికారులు దుర్వినియోగం చేసుకోకుండా ఉండేందుకు 'వివేకంతో' కొన్ని నిబంధనలు/ షరతులను ప్రవేశ పెట్టాయి. పదవీ విరమణ వయస్సును పెంచే ముందు న్యాయాధికారుల పనితీరును హైకోర్టులు సమగ్రంగా పరిశీలించాలన్న సిఫార్సులు వచ్చాయి. అనుభవం ఉన్న న్యాయాధికారులను అలాగే ఉంచుతూ, పనితీరు సరిగ్గా లేని లేదా అవసరం లేని వారిని తొలగిస్తే, కొత్తగా ప్రతిభావంతులైన యువ న్యాయాధికారులకు అవకాశాలు లభిస్తాయని, దాంతో న్యాయవ్యవస్థ మరింత చురుకుగా, శక్తివంతంగా మారుతుందని సుప్రీం కోర్టు చెప్పింది.

యువతకు చేరువగా రాహుల్

'కాంగ్రెస్ ముక్త్' నినాదంతో తొలిసారి బిజెపికి పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీ తీసుకొచ్చి, ప్రధానమంత్రి పదవి చేపట్టినప్పటి నుండి గత పుష్కరకాలంగా దేశ రాజకీయ అజెండాను నరేంద్ర మోడీ నిర్దేశిస్తున్నారు. ఆయన ఇచ్చే నినాదాల చుట్టూ మిగిలిన రాజకీయ పక్షాలు అన్ని తిరిగే పరిస్థితులు కల్పిస్తున్నారు. దానితో ఆయన తిరుగులేని నాయకుడిగా ఎదగడంతోపాటు ఒక్కొక్క రాష్ట్రంలో ప్రతిపక్షాల కోటలను కూల్చివేస్తున్నారు. అయితే, 2024 ఎన్నికల్లో 400 సీట్లు గెలవబోతున్నామనే భరోసా వ్యక్తం చేస్తూ బిజెపి పూర్తి మెజారిటీ కూడా తీసుకురాలేకపోవడం, టిడిపి, జెడియుల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిరావడంతో ఆయనపట్ల ప్రజలలో ప్రతికూల సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయినా ప్రతిపక్షాలలో మోడీని ఎదుర్కొనే నాయకత్వం కనిపించకపోవడంతో ఆ తర్వాత హర్యానా, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో బిజెపి తిరుగులేని విజయాలు సాధిస్తూ వచ్చింది. రిటైర్మెంట్ కన్నా జడ్జీల అనుభవమే మిన్న ఇటువంటి పరిస్థితుల్లో నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా యువత ఉద్యమాలు చేపట్టడం, బలప్రయోగం ద్వారా వాటిని అణచివేసే ప్రయోగాలు విఫలం కావడంతో మొదటిసారిగా ప్రజాగ్రహంతో ప్రధాని మోడీ తన కీలక మంత్రి ఒకరు ధర్మేంద్ర ప్రధాన్‌ను త్యాగం చేయాల్సి వచ్చింది. రాజకీయాలకు అతీతంగా యువతలో ప్రభుత్వ పనితీరుపట్ల తీవ్రమైన అసమ్మతి, ఆగ్రహం నెలకొందని వెల్లడైంది. ముఖ్యంగా నిరుద్యోగం, ధరల పెరుగుదల, అంతులేని అవినీతి, సామాన్య ప్రజలకు అందుబాటులో లేని విద్యావ్యవస్థ, విఫల ప్రభుత్వ యంత్రాంగం కారణంగా మోడీ, బిజెపి రాజకీయంగా భారీగా మూల్యం చెల్లించక తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి. యువతరానికి అగ్ని'పరీక్ష' ఈ సంకేతాలను మొదటగా గ్రహించి నూతన రూపంలో యువత ముందుకొచ్చిన నాయకుడు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అని చెప్పవచ్చు. ఢిల్లీలో సిజెపి నిరసనలు ప్రారంభానికి ముందే కోచింగ్ కేంద్రాలను ప్రసిద్ధి చెందిన రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమం ద్వారా యువత ముందు ఓ బలమైన నాయకుడిగా వచ్చారు. జంతర్ మంతర్ ముందు నిరసన ఉద్యమం ముగిస్తున్న సమయంలో నేరుగా ప్రధాన మంత్రి ఇంటివద్దనే ధర్నా నిర్వహించడం ద్వారా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయలేక తప్పని పరిస్థితి కల్పించారు. ఆ తర్వాత ఢిల్లీలో ఓ పోలీస్ స్టేషన్ ముందు మెరుపు బైటాయింపు ద్వారా పెల్లెట్ తుపాకీ దెబ్బలకు గురైన ఓ యువకుడి ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధంగా చేయగలిగారు. ఆ తర్వాత ప్రయోగరాజ్ పుణెలలో జరిగిన 'ఛాత్రోన్ కి గూంజ్' కార్యక్రమాలు గాంధీ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వ్యూహంలో వచ్చిన మార్పును ప్రతిబింబించాయి. మహిళలపట్ల ఆందోళన వ్యక్తం చేయడానికి రాజకీయ పార్టీలు సాధారణంగా వాడే 'సంక్షేమం' లేదా 'సాధికారత' వంటి మృదువైన పదాలను కాకుండా ఆయన 'పితృస్వామ్య వ్యవస్థను బద్దలుకొట్టడం' గురించి మాట్లాడారు. ఆర్ఎస్ఎస్, బిజెపిలకు 'మనుస్మృతి మనస్తత్వం' ఉందని ఆరోపించారు. ఈ సమావేశం నిర్వహణ తీరు కూడా భిన్నంగా జరిగింది. రాహుల్ వేషధారణలోనూ మార్పు కనిపించింది. సాధారణంగా ఆయన ధరించే లేత గోధుమ రంగు ప్యాంట్, తెల్లని టీ-షర్ట్ (ఒక చేతిని జేబులో పెట్టుకునే అలవాటుతో) కాకుండా, ఈసారి ఆయన కాస్త స్టైలిష్‌గా ఉండే పసుపు రంగు షర్ట్ ధరించారు. అంతకుముందు ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన 'ఛాత్రోన్ కి గూంజ్' సభలో ఆయన గులాబీ రంగు షర్ట్ ధరించారు. రాహుల్ రూపురేఖల్లో లేదా శైలిలో ఈ మార్పు వెనుక ఉన్న ఉద్దేశం కేవలం ఇప్పటివరకు పార్టీ తగినంతగా దృష్టి సారించని 'జెన్ -జెడ్' తరం వారిని, ముఖ్యంగా మహిళలను ఆకర్షించడం అని స్పష్టం అవుతుంది. పట్టణ ప్రాంతాలకు చెందిన విద్యావంతులైన, మధ్యతరగతి, అగ్రవర్ణాలకు చెందిన చాలామంది యువత ఆయన 'సాంప్రదాయేతర' పద్ధతులను ఇష్టపడుతున్నట్లు కనిపిస్తున్నది. మోడీ ప్రధాని కాగానే కాంగ్రెస్ ఉనికిని సమాధి చేసే ప్రయత్నంలో భాగంగా ఆ పార్టీ కీలక నేత రాహుల్‌ను 'పప్పు' అంటూ ప్రచారం చేయడం ప్రారంభించారు. వరుసగా ఆయన నేతృత్వంలో ఎన్నికల్లో పరాజయాలకు కేంద్రబిందువు కావడంతో ఆయనను 'విఫల నేత'గా సొంత పార్టీ వారు కూడా పరిగణించే విధంగా చేయగలిగారు. అందుకు రాహుల్ వైఖరి కూడా తోడయింది. 'క్వాంటమ్'దే భవిత అంటరానితనాన్ని ప్రోత్సహిస్తుందని, అలాగే అణగారిన కులాలు, మహిళలకు సమానత్వం, స్వయంప్రతిపత్తిని నిరాకరిస్తుందని విమర్శిస్తూ సరిగ్గా ఒక శతాబ్దం క్రితం, 1927లో బి.ఆర్. అంబేద్కర్ బహిరంగంగా మనుస్మృతిని దహనం చేశారు. ఆ తర్వాత, ఆగస్టు 29న, హల్ద్వానిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను శుభ్రం చేసిన వారిపై చర్యలు తీసుకోని బిజెపిని గాంధీ తీవ్రంగా విమర్శించారు. ఖర్గే దళితుడు కావడం వల్లే ఇలా జరిగిందని ప్రతిపక్ష నాయకుడు వాదించారు. ఈ 'శుద్ధీకరణ' చర్యను దళితులపై కొనసాగుతున్న అంటరానితనంతో ముడిపెట్టడానికి గాంధీ ప్రయత్నించారు. 2014 నుండి తన బేస్‌ను విస్తరిస్తూ ఒబిసిలు, దళితులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, బిజెపి అంతిమంగా అగ్రవర్ణాల పార్టీగానే మిగిలిపోయిందని ప్రజలకు చూపించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో తమకు సంబంధం లేదని బిజెపి ప్రకటించి ఎదురుదాడికి దిగింది. కానీ గాంధీ మాత్రం వెనక్కి తగ్గలేదు. అతిపెద్ద ప్రతిపక్ష పార్టీకి చెందిన దళిత అధ్యక్షుడికే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, ఇక గ్రామాల్లోని సామాన్య దళితుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు దళితులు తిరిగి ఆ పార్టీ వైపు మళ్లడంపైనే ఆధారపడి ఉందని గాంధీకి తెలుసు. రాజ్యాంగబద్ధంగా లభించిన రిజర్వేషన్లను కోల్పోతామనే దళితులలో భయం కలిగించడం ద్వారానే 2024 ఎన్నికల్లో బిజెపి సొంతంగా మెజారిటీ సాధించలేకపోయింది. హిందీ మాట్లాడే ప్రాంతాల్లో ఒబిసిల విషయంలో పెద్దగా పురోగతి సాధించలేకపోయినప్పటికీ, గాంధీ వారిని ఆకర్షించే ప్రయత్నాలను విరమించుకోలేదు. కులగణనలో ప్రశ్నలను మార్చాలని కోరుతూ ఆయన, ఖర్గే ప్రధాన మంత్రి మోడీకి రాసిన లేఖ ఆ వర్గాలను ఆకట్టుకొనే ప్రయత్నమే. ఆ విధంగా యువత, మహిళలు, దళిత, ఒబిసిలను ఆకట్టుకోవడం ద్వారా 2019 ఎన్నికలలో కాంగ్రెస్ విజయావకాశాలు మార్గం ఏర్పరచేందుకు సరికొత్త ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, రాహుల్ గాంధీకి అసలు సమస్య ఛిన్నాభిన్నమైంది కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం.

జటిలమైన రాజకీయ భవిష్యత్తు!

ఏదీ తెగేదాకా లాగొద్దనేది పెద్దల వాదన. సమస్యను చిన్నదిగా ఉన్నప్పుడే సామరస్యంగా పరిష్కరించుకుంటే అన్ని సర్దుకుంటాయి. కానీ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం పెద్ద చర్చగా మారింది. మంత్రి పదవిలో ఉన్న సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ నుంచి తప్పించారు. గవర్నర్ కూడా దీనికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత కొండా సురేఖ శాఖలు సీఎం దగ్గరకు చేరాయి. విమర్శలు, వివరణలు, రిపోర్టుల తర్జనభర్జన తర్వాత.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎండ్ కార్డ్ పడింది.. దీంతో ఒక్కసారిగా కొండా కుటుంబం రాజకీయ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. ఈ గొడవ ఒక్కరోజులో మొదలైంది కాదు. కొండా సురేఖ కూతురు సుష్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడంతో అసలు గొడవ మొదలైంది. ముఖ్యంగా పరకాల సీటు విషయంలోనే కొండా కుటుంబానికి, రేవంత్‌రెడ్డి వర్గానికి మధ్య దూరం పెరిగిందనే చర్చ ఉంది. పరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం కూతురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు. కూతురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరించారు. పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా రాజకీయ పరిచయాలు ఉన్నాయి. అదే సమయంలో రేవంత్‌రెడ్డి అక్కడ తనకు నమ్మకమైన నాయకులను ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఇద్దరి దారులు వేర్వేరుగా కనిపించడంతో దూరం పెరిగిందనే మాట వినిపిస్తోంది. సురేఖ కూడా తనను ప్రభుత్వం పక్కన పెడుతోందని గతంలో కొన్ని సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారనే వార్తలు వచ్చాయి. అందుకే కూతురు చేసిన వ్యాఖ్యలు ఒక్కటే కారణం కాదని, ముందే కొంత దూరం పెరిగి ఉండొచ్చని రాజకీయంగా చర్చ జరుగుతోంది. అయితే ఇది రాజకీయ అంచనా మాత్రమే. కొండా సురేఖ కూడా మౌనంగా ఉండలేదు. తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులపై కూడా ఆమె ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ సురేఖ చేసిన ఆరోపణలే. వాటిని నిజమని నిర్ధారించే ఆధారాలు బయటకు రాలేదు. కాంగ్రెస్ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు వెళ్లింది. దీంతో మంత్రి పదవి పోయింది. ఇక్కడే అసలు రాజకీయం కనిపిస్తోంది. ఇది కేవలం ఒక మంత్రి పదవి పోయిన వ్యవహారం మాత్రమే కాదు. పార్టీలో ఎవరికి ఎంత బలం ఉంది, ఎవరితో ఎవరు కలిసి నడుస్తున్నారు, వచ్చే ఎన్నికల నాటికి ఎవరి మాట ఎంత వరకు చెల్లుతుంది అన్న లెక్కలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలు కూడా కలకలం రేపాయి. డబ్బుల పంపకానికి సంబంధించిన గొడవ వల్లే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆయన ఆరోపించారు. అవినీతి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన అన్నారు. అయితే రాజాసింగ్ చెప్పింది ఆరోపణ మాత్రమే. దానికి ఇప్పటివరకు బలమైన ఆధారం బయటకు రాలేదు. సురేఖ కూడా తనపై అలాంటి ఆరోపణలు లేవని చెబుతున్నారు. కాబట్టి ఈ మాటలను రాజకీయ ఆరోపణలుగానే చూడాలి. సురేఖను తప్పించిన తర్వాత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు. ఈ మార్పులను కొందరు రాజకీయంగా చూస్తున్నారు. బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఏర్పడే ప్రభావాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంగా కొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇదే కారణంతో ఈ నియామకాలు చేసిందని అధికారికంగా చెప్పలేదు.తెలంగాణలో మంత్రి పదవిలో ఉండగానే బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భాలు గతంలోను ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో 2015లో తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత 2021లో ఈటల రాజేందర్‌ను కూడా కేబినెట్ నుంచి తొలగించారు. ఈటలపై భూముల విషయంలో ఆరోపణలు రావడంతో ఆయన శాఖను తీసుకుని, ఆ తర్వాత కేబినెట్ నుంచి బయటకు పంపారు. ఈ ఆరోపణలను ఈటల ఖండించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కూడా ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం కూడా అదే వరుసలో మరో రాజకీయ ఘటనగా మారింది. అయితే మూడు ఘటనలకు మూడు వేర్వేరు కారణాలు ఉన్నాయి. అందుకే వాటిని ఒకే గాటన కట్టడం సరికాదు.మంత్రి పదవి పోయిందంటే కొండా కుటుంబం రాజకీయంగా అయిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది.

భానుమూర్తి మన ప్రాణ దీప్తి!

సూర్యుడు అనంత చైతన్య స్వరూపుడు. అఖండ శక్తి సమన్వితుడు. కాలాన్ని నడిపించేదీ, కాల గమనాన్ని శాసించేదీ ఆయనే. గూటిలోని గువ్వపిట్టను మేల్కొలిపేదీ, నిద్రపుచ్చేదీ ఆయనే. మనలో జఠరాగ్నిని రగిల్చేదీ, కడుపు నింపేదీ కూడా ఆ ప్రత్యక్ష దైవమే. చెట్టూ పుట్టా జనమూ జలమూ అన్నిటికీ భాస్కరుడే బలం. అంతెందుకు, అవతార పురుషుడైన రామచంద్రుడికే అలసిన వేళ ఆలంబన అయ్యింది అద్భుతమని చెప్పుకోదగ్గ ఆదిత్య హృదయం. భానుడు సాక్షాత్తూ వేద స్వరూపుడు అంటుంది మంత్రం. ఆయన అనుగ్రహం అక్షయం. అందుకే ఆయన కదిలితే పండుగ. ఆయన మరలితే పర్వం. పన్నెండు రాశుల్లోనూ సంచరించే సూర్యుడు ఇప్పుడు మకర రాశిలో ప్రవేశిస్తున్నాడు. ఆ సందర్భాన్నే మకర సంక్రాంతిగా ఊరూవాడా జరుపుకొంటుంది. ఆయన ప్రసాదమైన ధాన్యపురాశుల్ని ముంగిట నింపుకొని ఆనందపు హేలలో మునిగితేలుతుంది. కాలగతి ఉత్తరాయణ పుణ్యకాలంలోకి అడుగిడుతున్న వేళ.. ఆ అక్షయ మూర్తికి అక్షర నీరాజనమిది. సప్తాశ్వ రథ ఆరూఢుడై భానుడు కదలి వస్తుంటే%ా% తెలిమంచు తెరలు తీస్తుంది. ఇలాతలం ఆప్యాయంగా ఆహ్వానం పలుకుతుంది. భోగిమంట ధూపమేస్తుంది. కళ్లాపి చప్పుళ్లు జేగంటలు మోగిస్తాయి. సప్తవర్ణాల ముగ్గులు బంగారు కిరణాలతో జతకూడి, సంరంభ సమాయత్తం చేస్తాయి. గొబ్బిళ్లు, చిక్కుళ్లు, రేగిపళ్లు సవినయంగా స్వాగతాంజలి ఘటిస్తాయి. సంక్రాంతి పండుగ అచ్చంగా సూర్యుడి పండుగే. సకల శుభంకరుడూ, సర్వ మంగళుడూ అయిన సూర్యుడు మరిన్ని మంగళాలను కలిగించే కాలానికి ప్రారంభం ఇది. అందుకే ప్రకృతినీ, మనిషినీ మమేకం చేస్తూ వేడుక చేసుకుంటాం ఇప్పుడు. నిరంతర చైతన్యశీలి అయిన సూర్యభగవానుడు మకర రాశిలో ప్రవేశించి, తన రథ గమనాన్ని ఈ రోజు ఉత్తర దిశగా మళ్లిస్తాడు. ఉత్తర దిశకు కుబేరుడు అధిపతి. దిక్కుల్లో ఉత్తమైనదిగా దీనికి పేరుంది. అందుకే ఈ సమయం ఉత్తరాయణ పుణ్యకాలమైంది. ఈనాటి నుంచే దేవతలకు పగలు ప్రారంభమవుతుంది.



ఆధ్యాత్మికం

ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

● హమాలీల కొరత లేకుండా చూసుకోవాలి ● ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి ● అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి ప్రతినిధి : ఖరీఫ్ 2026 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మిల్లులకు మ్యాపింగ్, రవాణా, హమాలీలు, గోదాముల లభ్యత, తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, నాణ్యత ధ్రువీకరణ, బోనస్, చెల్లింపులు, ఏఐ సాంకేతికత వినియోగం తదితర అంశాలపై అదనపు కలెక్టర్ సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ ధాన్యం రవాణాకు ఏర్పాటు చేసే ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకర్ తప్పనిసరిగా ఉండాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వాహనం కదలికలను క్రమం తప్పకుండా ట్రాక్ చేయాలని, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రవాణా అవసరాల కోసం మాత్రమే ఆ వాహనాలను వినియోగించాలని ఆదేశించారు. వాహనాలను ఏర్పాటు చేసే కాంట్రాక్టర్లు ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ధాన్యం రవాణా చేసే వాహనాల్లో అధిక లోడును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని, నిర్దేశిత సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే ధాన్యాన్ని రవాణా చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సీజన్‌లో హమాలీల సమస్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు ప్రతి రైస్ మిల్లుకు అవసరమైన సంఖ్యలో హమాలీలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతి, లోడింగ్, అన్‌లోడింగ్ తదితర ప్రక్రియలకు అవసరమైన హమాలీలు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే మాయిశ్చర్ మీటర్లు, ధాన్యం శుభ్రపరిచే ప్యాడీ క్లీనర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోని తూకం యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో మెట్రాలజీ శాఖ అధికారులు ముందుగానే తనిఖీ చేసి ధ్రువీకరించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు కొనుగోలు ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తూకం, తేమ శాతం పరిశీలన, కొనుగోలు నమోదు, బోనస్, చెల్లింపులు తదితర అంశాలపై వారికి అవసరమైన శిక్షణను ముందుగానే అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల సన్న రకాల ధాన్యానికి బోనస్ అందనున్నందున, అర్హత కలిగిన ధాన్యానికి నిబంధనల ప్రకారం బోనస్ అందేలా నాణ్యతను ఏఈఓలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు ధ్రువీకరించాలని ఆదేశించారు. నాణ్యత ధ్రువీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రతిపాదించాలని సూచించారు. ప్రతిపాదించిన ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంబంధిత రైస్ మిల్లులకు కేటాయించి, కొనుగోలు కేంద్రాల వారీగా మిల్లులకు అవసరమైన మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కేటాయింపులకు సంబంధించి మిల్లర్లు తప్పనిసరిగా బ్యాంకు గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసారి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఏఐ సాంకేతికతను వినియోగించనున్నామని, కొనుగోలు కేంద్రాల నుంచి అప్‌లోడ్ చేసే ఫోటోలు, వివరాలను సాంకేతికత ద్వారా పరిశీలించే అవకాశం ఉంటుందని తెలిపారు. పాత ఫోటోలను అప్‌లోడ్ చేసి ప్రస్తుత పరిస్థితులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేసినా సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. కాబట్టి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తాజా ఫోటోలు, వివరాలను మాత్రమే నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు వివరాలను సంబంధిత ఆన్‌లైన్ వ్యవస్థలో ఎప్పటికప్పుడు, ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. రైతులకు చెల్లింపులు ఎలాంటి పొరపాట్లు లేకుండా సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత సీజన్‌లో చెల్లింపులకు సంబంధించి కొన్ని సమస్యలు ఎదురైనందున, ఈ సీజన్‌లో అవి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఈ సీజన్ ధాన్యం నిల్వకు కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల గోదాం స్థలాన్ని ముందుగానే గుర్తించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ నియంత్రణలో ఉన్న గోదాముల స్థలాన్ని కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు కేటాయించకూడదని స్పష్టం చేశారు. ధాన్యం నిల్వకు అవసరమైన గోదాం సామర్థ్యాన్ని ముందుగానే గుర్తించి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు అక్టోబర్ 1 నుంచి పనిచేయాల్సి ఉన్నందున కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మిల్లులకు మ్యాపింగ్, హమాలీల నియామకం, రవాణా వాహనాల ఏర్పాటు, జీపీఎస్ ట్రాకింగ్, గోదాముల గుర్తింపు, అవసరమైన పరికరాల ఏర్పాటు, సిబ్బందికి శిక్షణ తదితర అన్ని ఏర్పాట్లను అక్టోబర్ 1కు ముందే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన తర్వాత రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను ముందుగానే పూర్తి చేసి, అక్టోబర్ 1నుంచి జిల్లాలోని అన్ని ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాల్లో సజావుగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా అధికారులు సమగ్ర కార్యాచరణతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు. అక్టోబర్ 1, 2026న ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఒకేసారి ప్రారంభించనున్నారని తెలిపారు. అదే రోజు నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నందున జిల్లాలో ప్రతిపాదించిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు అక్టోబర్ 1 నుంచే పనిచేసేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలోజిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్ , జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, రవాణా కాంట్రాక్టర్లు, సంబంధితశాఖల అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త కూరగాయల మార్కెట్ రోడ్ వెంటనే నిర్మించాలి

- మందులకని పోయి మాసికానికి వచ్చినట్టు ఉంది రామగుండం ఎమ్మెల్యే పాలన - సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, సిపిఐ నగర కార్యదర్శి కే కనకరాజ్ ఎద్దేవ

గోదావరిఖని ప్రతినిధి : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శివాజీ నగర్ శాఖ ఆధ్వర్యంలో కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలో అసంపూర్ణంగా ఉన్న సిసి రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతాన్ని సిపిఐ శ్రేణులు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, సిపిఐ నగర కార్యదర్శి కే కనకరాజు మాట్లాడుతూ "రామగుండం నియోజకవర్గంలో కానీ కార్పొరేషన్ లో గాని అభివృద్ధికి ఆమడ దూరంలో పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. గోదావరిఖని ప్రాంతంలోని ప్రజలందరికీ ప్రత్యక్షంగా కూరగాయల మార్కెట్ కు రాకపోకలు ప్రతిరోజు ఉన్న సందర్భంలో ఈ రోడ్డు అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఉన్నటువంటి రోడ్లను ధ్వంసం చేసి నూతన రోడ్లు నిర్మిస్తామని చెప్పి వెళ్ళిపోతున్నారు తప్ప గత సంవత్సరం నర కాలంగా ఈ రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలువ ఉండడం వల్ల ప్రజలు అనారోగ్య పారిన పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కుండీలు చాంబర్లు ఆరు నెలలు కాకముందుకే ధ్వంసమైన పద్ధతి చూస్తే ఎంత నాణ్యతతో నిర్మించారు స్పష్టంగా అర్థమవుతుందని విమర్శించారు. రామగుండం ఎమ్మెల్యే పద్ధతి చూస్తే వెనకటికి మందులకని పోయి మాసికానికి వచ్చిండు అన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. 800 కోట్లు తెచ్చి రామగుండాన్ని అభివృద్ధి చేస్తున్నానని ప్రగల్బాలు పలుకుతున్న ఎమ్మెల్యే, మేయర్ ఒక్కసారి ఆకాశం నుండి భూమి మీదకు వచ్చి కింద చూస్తే వాళ్ళు చేసే అభివృద్ధి కళ్ళకు కనబడుతుంది అని చెప్పి దుయ్యబట్టారు. రామగుండం కార్పొరేషన్ లో గత మూడు సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా పనులు సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తకోరాల మార్కెట్ దగ్గర ఉన్న అసంపూర్ణ సిసి రోడ్డును వెంటనే నిర్మించడంతోపాటు కార్పొరేషన్ లో ఇప్పటివరకు అభివృద్ధి పేరుతో ధ్వంసం చేసిన సిసి రోడ్డులన్నీ వెంటనే నిర్మాణం చేయకపోతే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఐ శివాజీ నగర్ శాఖ కార్యదర్శి రాణవేణి సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్

గోవర్ధన్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య సిపిఐ నాయకులు రేణిగుంట్ల ప్రీతం, పోతరాజు నాగరాజు, సాధుల శివ, షేక్ చాంద్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలి

మండపాల వద్ద ఊరేగింపులో మద్యం సేవించి గొడవలకు పాల్పడితే సహించేది లేదు

ఉత్సవ కమిటీ సభ్యులకు స్పష్టం చేసిన మహేశ్వరం ఏసిపి జానకిరెడ్డి



మహేశ్వరం సెప్టెంబర్ 08 : ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని మహేశ్వరం ఏసిపి జానకి రెడ్డి స్పష్టం చేశారు. మహేశ్వరం డివిజన్ కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ సర్పంచులకు వార్డు మెంబర్లకు వినాయక మండపాల కమిటీ సభ్యులకు భద్రత ప్రమాణాల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు ఉండకుండా ప్రధాన రహదారులపై వినాయక మండపాలు ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయొద్దన్నారు. విద్యుత్ మండపాలకు భద్రత ప్రమాణాలు కలిగిన విద్యుత్ వైర్లను అమర్చుకోవాలన్నారు. అవసరమైతే వినాయక మండపాల్లో సిసి కెమెరాలు అమార్చుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద మద్యం సేవించి గొడవలకు పాల్పడి శాంతిభద్రతకు విఘాతం కలిగిస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వినాయకమండపాలతో పాటు నిమజ్జనానికి తరలించే క్రమంలో భద్రతపరమైన రహదారులను ఎంచుకొని విద్యుత్ వైర్లు తగలకుండా చూసుకోవాలన్నారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో బాధ్యతాయుతంగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ హెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ ఐ వి చందర్ సింగ్, కందుకూరు ఏఈ వేణుగోపాల్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు వార్డు మెంబర్లు వినాయక మండపాల సభ్యులు పాల్గొన్నారు.

48వ డివిజన్‌లో ఉచితంగా నీటి సరఫరా చేసిన తోట రామారావు

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 08: స్థానిక 48వ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో గత మూడు రోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ అధికారులు ఇప్పటివరకు ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజల ఇబ్బందులను గుర్తించిన స్థానిక మాజీ కార్పొరేటర్ తోట రామారావు స్పందించారు. అంబేద్కర్‌నగర్‌లోని మేకల భిక్షమయ్య ఫంక్షన్ హాల్ పక్కన ట్యాంకర్ ద్వారా ఉచితంగా నీటిని ప్రజలకు సరఫరా చేశారు. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా తోట రామారావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, మూడు రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులను వెంటనే పూర్తి చేసి, అంబేద్కర్‌నగర్‌తో పాటు నీటి సరఫరా నిలిచిపోయిన ప్రాంతాలకు ప్రభుత్వం తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఏర్పడకుండా ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చేతి కృష్ణ, ఎ.కే. బాబా కృష్ణ నాయక్, నిరంజన్, లింగారెడ్డి, తోట రమేష్, వేల్పుల శ్రీనివాస్, చింటూ, కుమారి, సైదమ్మ, రమాదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్పీకర్‌పై తాత మధు వ్యాఖ్యలు దుర్మార్గం

డీసీసీ అర్బన్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి రోళ్ళ సతీష్ తీవ్ర ఆగ్రహం

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్8: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ, డీసీసీ అర్బన్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి రోళ్ళ సతీష్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటి శాసనసభ స్పీకర్ పదవిని కించపరిచే విధంగా మాట్లాడటం తాత మధు రాజకీయ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్య విలువలను నిలువునా అవమానించడమేనని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. అధికారం కోల్పోయిన బాధలో, ఫ్రస్ట్రేషన్‌లో ఇష్టానుసారంగా మాట్లాడటం బీఆర్ఎస్ నాయకులకు తగదని హెచ్చరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన వ్యాఖ్యలను తాత మధు వెంటనే వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని రోళ్ళ సతీష్ డిమాండ్ చేశారు.

గోదావరిఖనిలో హోరెత్తిన గులాబీ నిరసన

- సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ - మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని ప్రతినిధి : శాసనసభ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై కాంగ్రెస్ ప్రభుత్వం అవమానకరంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నాయకత్వంలో గోదావరిఖని మున్సిపల్ కార్పొరేషన్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా ప్రజాప్రతినిధులకు ఇస్తున్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. సీనియర్ నాయకురాళ్లు, మాజీ మంత్రుల పట్ల అసెంబ్లీలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అహంకారపూరితంగా ఉందన్నారు. కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి, వ్యాళ్ల హరీష్ రెడ్డి, మూల విజయ్ రెడ్డి, కరక పద్మజ శ్రీనివాస్, పోగుల వకుళ, సత్యవతి, మేకల సమ్మయ్య యాదవ్, మురళీధర్ రావు, తోకల రమేష్, తాళ్ల రాజయ్య, ఆముల నారాయణ, కార్పొరేటర్ నిమ్మరాజుల రవిలతో పాటు మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

శ్రీమద్ విరాట్ విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ఈనెల 15 నుండి 17 వరకు బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్8: కరీంనగర్ పట్టణం కమాన్ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈనెల15 నుండి17 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మంగళవారం రోజున ఆలయ కమిటీ సభ్యులు శ్రీమద్ విరాట్ విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి టెంపుల్ ఆలయ కమిటీ సభ్యులు, విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా, ఘనంగా బ్రహ్మోత్సవాల ను నిర్వహించడానికి ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీన ప్రారంభమయ్యే ఈ వేడుకలు సెప్టెంబర్ 17 వరకు వివిధ విశేష పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కన్నుల పండుగ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. విశ్వబ్రాహ్మణ బంధువులందరూ ఈ దివ్య మహోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

గోదావరి పుష్కరాల పనులను త్వరగా పూర్తి చేయాలి

- రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి
- గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి : గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, దేవాదాయ ఆలయాల అభివృద్ధి, భూసేకరణ, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పార్కింగ్, కేశఖండనం, అన్నదానం తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల కోసం ప్రధానంగా రోడ్ల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, దేవాదాయ ఆలయాల అభివృద్ధి పనులతో పాటు భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పుష్కరాల కోసం ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.25 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయని, టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పనులను సుమారు నాలుగు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.మంథని ఆలయాల సమూహ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో 15 అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గౌతమేశ్వర, సురబాండేశ్వర, ఓంకారేశ్వర, త్రిబంధేశ్వర, మహాలక్ష్మి తదితర ఆలయాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు.ఇప్పటికే 10 పనులకు టెండర్లు ఖరారయ్యాయని, డిజైన్ ఆమోదాలు పూర్తయ్యాయని, అవసరమైన పత్రాల ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. కాబట్టి క్షేత్రస్థాయిలో పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. శంకుస్థాపన కోసం పనులు నిలిపివేయాల్సిన అవసరం లేదని, శంకుస్థాపన కార్యక్రమం తరువాత నిర్వహించినప్పటికీ ముందుగా గ్రౌండ్ లెవల్ పనులను ప్రారంభించాలని స్పష్టం చేశారు.అభివృద్ధి పనులు అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో చేపట్టాలని సూచించారు. పనుల సందర్భంగా రహదారులు, తాగునీటి పైప్‌లైన్లు, డ్రైనేజీలు దెబ్బతిన్నట్లయితే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. అవసరమైన విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు.గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తలనీలాలు సమర్పించే అవకాశం ఉన్నందున కేశఖండనం కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్నదాన మండపాల ఏర్పాట్లను కూడా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.రోడ్ల అభివృద్ధి, ఆలయాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం తదితర పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపినందున వాటిపై నిరంతరం ఫాలోఅప్ చేస్తూ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.సాధారణంగా భూసేకరణ ప్రక్రియకు సుమారు 90 రోజుల సమయం పడుతుందని, అయితే పుష్కరాలకు తక్కువ సమయం ఉన్నందున స్థానిక రైతులతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్నేహపూర్వకంగా చర్చించి వారి సహకారం తీసుకోవాలని తెలిపారు. అవసరమైన భూమిని త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పార్కింగ్

కోసం అవసరమైన భూమిని రైతుల నుంచి తాత్కాలికంగా లీజుకు తీసుకోవాలని, సంబంధిత రైతులకు ఒక సీజన్ కౌలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఘాట్ల నిర్మాణానికి అవసరమైన భూమిని వెంటనే సంబంధిత శాఖలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఘాట్ల నిర్మాణానికి అవసరమైన భూమి ఇప్పటికే ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయినందున స్థానిక రైతులతో సఖ్యతగా చర్చించి, ప్రజాప్రతినిధుల సహకారంతో భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూమికి సంబంధించిన చెల్లింపులు కూడా త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరిలో అవసరమైన నీటి లభ్యతకు సంబంధించి డీ-సిల్టింగ్ తదితర పనులను కూడా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఘాట్ల నిర్మాణ పనులకు అవసరమైన చర్యలను ముందుగానే పూర్తి చేసి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్య కారణంగా పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైన డిజైన్ మార్పులకు సంబంధించిన ఆమోదాల కోసం సంబంధిత శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అనుమతులను త్వరగా పొందాలని ఆదేశించారు.ఓదెల ఆలయ అభివృద్ధికి సంబంధించిన డిజైన్‌ను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.మంథని పట్టణంలోని ఇతర అంతర్గత రోడ్ల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను కూడా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ పనులను వచ్చే సంవత్సరం చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఘాట్ల నిర్మాణం పూర్తయిన అనంతరం జనవరి చివరి లేదా ఫిబ్రవరి నుంచి ఘాట్ల సుందరీకరణ పనులను ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, మున్సిపల్ పారిశుధ్య పనులకు మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించేలా అవసరమైన పనులను ప్రతిపాదించి, త్వరగా చేపట్టాలని సూచించారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని, ప్రజాప్రతినిధుల సహకారంతో పనులను వేగవంతంగా పూర్తి చేసి భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంథని ఆర్డీఓ సురేష్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ఏ.డి.సుప్రియ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

- పంటల వివరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి : డిజిటల్ క్రాప్ సర్వేను ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.వ్యవసాయ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. డిజిటల్ క్రాప్ సర్వే, యూరియా సరఫరా, సేంద్రియ వ్యవసాయం, పంటల సాగు విస్తీర్ణం, రైతులకు అందుతున్న వ్యవసాయ సేవలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ పరిధిలో సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని అన్నారు.డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో ఎలాంటి తప్పులు, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు.పంటల సాగు పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులకు లాభదాయకమైన పంటలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని రైతులతో నిరంతరం

అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతులకు అందుతున్న సేవల అమలును మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని, లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

- భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు కాంగ్రెస్ ప్రభుత్వానికి చావు డప్పు నిరసన

పెద్దపల్లి ప్రతినిధి : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పెద్దపల్లి కలెక్టరేట్ ముందు భారతీయ జనతా యువమోర్చా నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీ'చావు డప్పు' నిరసన వ్యక్తం చేసి జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువమోర్చా నాయకులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. యువమోర్చా నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ 'చావు డప్పు' కొట్టి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నప్పటికీ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యువమోర్చా నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉన్నత విద్యపై ప్రభావం పడకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు."విద్యార్థుల హక్కుల కోసం యువమోర్చా నిరంతరం పోరాడుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయాలి. లేకపోతే విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతాం" కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను నాయకులను అడ్డుకుంటాం పెద్దపల్లి ఎమ్మెల్యే

ప్రభుత్వ విప్ ఇంటిని ముట్టడిస్తాం అని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువమోర్చా నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్, సీనియర్ నాయకులు తంగడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, మేకల శ్రీనివాస్, ఒల్లే తిరుపతి,ఈర్ల శంకర్, కావేటి రాజగోపాల్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఉప్పు కిరణ్, మహంత కృష్ణ,పట్టణ ప్రధాన కార్యదర్శులు గుడ్ల సతీష్, బోలవేన సురేందర్, గాదాసి సతీష్, బొడ్డుపల్లి కుమార్, సబ్బు మల్లయ్య, పడాల శ్రీనివాస్ గౌడ్ వీరేశం గౌడ్ గడ్డం అనిల్, సుంకనపల్లి ఆంజనేయులు ఇంజపురి సోనీ పెద్దపల్లి యువ మోర్చా నాయకులు కుశానపల్లి మధుకరన్, కుక్క అంజి, పెద్దపల్లి మండల యువమోర్చా అధ్యక్షులు రెడ్ల వేణు, కాల్వ శ్రీరాంపూర్ మండల యువమోర్చా అధ్యక్షులు దిలీప్, ఓదెల యువమోర్చా నాయకులు శాతల్లా కుమార్, సిలారపు మహేష్, కలవెల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎంహెచ్ఓ

మానకొండూర్, సెప్టెంబర్8: కరీంనగర్ జిల్లా మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి వైద్యులు బి. రాజగోపాల్ రావు సందర్శించారు. రికార్డుల నిర్వహణ, ఫైలేరియాసిస్ కేసుల పరిస్థితి, బాధితులకు అందుతున్న చికిత్స, ఫాలోఅప్, వ్యాధి నివారణ, నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. మందుల లభ్యత, ఆరోగ్య కార్యక్రమాలు, సిబ్బంది పనితీరును పరిశీలించి కేసులను సకాలంలో ఫాలోఅప్ చేస్తూ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలను నిరంతరం అందించే అంశాలపై సిబ్బందికి డీఎంహెచ్ఓ సూచనలు చేశారు. మండల వైద్యాధికారి సల్మాన్, సిహెచ్ఓ.ఖలీమొద్దీన్ ఆరోగ్య కేంద్ర సిబ్బంది పరిశీలనలో డిఎంహచ్ఓ వెంట ఉన్నారు.

దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా చంద్రకళ

పెద్దపల్లి ప్రతినిధి : దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన ఉద్యమ కళాకారిణి, దళిత రత్న అవార్డు గ్రహీత దెబ్బేట చంద్రకళను నియమించారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రమౌళి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంతో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం చంద్రకళ నిరంతరం పోరాడుతున్నారని చంద్రమౌళి పేర్కొన్నారు. దళిత మహిళల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి చంద్రకళ కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నియామకంపై పలువురు దళిత, బహుజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మానకొండూరులో జీవి రామకృష్ణారావు గృహనిర్బంధం

మానకొండూర్, సెప్టెంబర్8: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి రామకృష్ణారావును మంగళవారం తెల్లవారు జామున పోలీసులు గృహనిర్బంధం చేయడంతో పాటు పలువురు మండల నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు.రామకృష్ణారావు మాట్లాడుతూ.....ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలను అడ్డుకునేందుకు నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేస్తున్నారని,ఇది సరికాదని తక్షణమే నిర్బంధంలో ఉన్న నాయకులను విడుదల చేయాలని రామకృష్ణ రావు డిమాండ్ చేశారు.

ఈ నెల 11న జాబ్ మేళా నిర్వహణ

జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్

పెద్దపల్లి ప్రతినిధి : జిల్లా ఉపాధి కార్యాలయం, టాస్క్ రీజినల్ సెంటర్, పెద్దపల్లి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సెప్టెంబర్ 11వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని బస్ డిపో ప్రాంగణంలో ఉన్న పాత ఎంపీడీవో కార్యాలయంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో సెప్టెంబర్ 11వ తేదీన ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ జాబ్ మేళాలో ఎల్ఎన్ ఎలక్ట్రానిక్స్ గ్రూప్, ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ సంస్థలు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని పేర్కొన్నారు. ఎల్.ఎన్ ఎలక్ట్రానిక్స్ గ్రూప్‌లో అసెంబ్లీ ఆపరేటర్లు, ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్లు, అపోలో ఫార్మసీలో ఫార్మసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్ల పోస్టులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీ.ఫార్మ్, ఎం.ఫార్మ్ ఇతర సంబంధిత విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.18,000 నుంచి రూ.25,000 వరకు వేతనం లభిస్తుందని, ఉద్యోగ నియామక ప్రదేశాలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటాయని పేర్కొన్నారు.ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 11వ తేదీన ఉదయం 10 గంటలకు తమ అప్‌డేటెడ్ సీవీ/రెజ్యూమ్ రెండు కాపీలు, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, అప్‌డేటెడ్ ఆధార్ జిరాక్స్, అనుభవ ధ్రువపత్రం ఉన్నట్లయితే దానితో జాబ్ మేళాకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు.అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9182117078, 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి: పి ఓ డబ్ల్యూ

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 08: వైరా మండలం కేజీ సిరిపురం గ్రామంలో ప్రగతిశీల మహిళ సంఘం ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని. నిరసన పెంచిన నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలని, బిజెపి ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని నినాదాలు చేశారు. సామాన్యుడు ఆదాయం మాత్రం పెరగలేదు. కానీ ప్రజల మీద నిత్యవసర సరుకులు ధరలు రోజురోజుకు పెరగటం వల్ల ప్రజల జీవనం రోజురోజుకి దిగజారుతున్న పరిస్థితి. అచ్చా దినంటే బిజెపి ప్రభుత్వంలో ప్రజలు చచ్చేదినుగా తయారైంది. పెట్టుబడిదారులకు దోపిడిదారులకు కార్పొరేట్లకు బ్లాక్ మార్కెట్ లో నిత్యవసర సరుకులు అధిక లాభాలకు అమ్ముకొని ప్రజల నవనాడులను పీల్చిపి చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిత్యవసర సరుకులు అధిక ధరలు తగ్గించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు ఎస్కె నాగూర్ మునిషాబేగం, చిట్టెమ్మ, పుష్పావతి,గౌష,షరీఫా,పరహాన,గౌశ,నాగలక్ష్మి,కుసుమాంబ తదితరులు పాల్గొన్నారు.

డీజే రహితంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి: మిర్యాలగూడ డీఎస్పీ జి. రవి

నల్గొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 8 హాలియా: హాలియా పట్టణంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో మిర్యాలగూడ డీఎస్పీ శ్రీ జి. రవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డీఎస్పీ జి. రవి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, డీజేలకు దూరంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీసు శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని మండపాల నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాలు, గణేష్ విగ్రహాల ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని శాంతిభద్రతల పరిరక్షణకు నిర్వాహకులు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరి సహకారంతో డీజే రహితంగా, భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దామని డీఎస్పీ జి. రవి పేర్కొన్నారు. ఈ సమావేశంలో హాలియా సీఐ శ్రీ ఎస్. రాఘవ రావు, హాలియా ఎస్సై శ్రీ బి. సాయి ప్రశాంత్తో పాటు వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

చీరలాగినోళ్ళ మీద చర్యలే లేవు.. దుశ్శాసన పర్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం

● గొంతులు కోయిమనే కవ్వంపల్లిని ఎమ్మెల్యేను చేశారా...?: మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, సెప్టెంబర్8: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాళ్ళపల్లి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై మాట్లాడుతూ.....ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు 100 రోజుల్లో నెరవేరుస్తానని 1000 రోజులౌతున్నా అమలు చేయకపోగా గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను సైతం నిలిపివేస్తున్నాడన్న ప్రజల ఆవేదనను దృష్టిలో పెట్టుకొని బిఆర్ఎస్ పార్టీ నిరసనలు చేపట్టడం జరిగిందన్నారు.వేలాదిమంది నిరుద్యోగ యువత నిరసనలో పాల్గొని ఇల్లంతకుంట ప్రజావాణిలో దరఖాస్తులిచ్చి వెయ్యి రోజుల పాలనకు ముగింపు పలకాలని వంటావార్పును కూడా నిర్వహించామన్నారు.గత ప్రభుత్వంలో కేసిఆర్ రిజర్వాయర్ల ద్వారా నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు నీరందించి, యూరియా బస్తాలు రైతుల ఇంటింటికే రాగా నేడు మొగులుకు చూసినా భూమి మీద నీరులేదని ఎద్దేవా చేస్తూ గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని గుర్తించిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్న బిఆర్ఎస్ నిరసనలు ఒక జాతరలాగా సాగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ వద్ద అడ్డుకున్నారని, పార్లమెంట్లోకి రాహుల్ గాంధీ నల్ల దుస్తులు ధరించి వస్తే లేని ఇబ్బంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ధరిస్తే ఎందుకో అర్థం కావడం లేదంటూ మహాభారతంలో దుశ్యాసనపర్వంగా ప్రభుత్వం మారగా కాంగ్రెస్ అంటేనే కౌరవ సంతతిగా ప్రజలు భావిస్తున్నారని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వారి మీద చర్యలు లేవుగని, కేసిఆర్ రాజీనామా చేయాలంటూ 420రేవంత్ రెడ్డి డ్రామాకు తెరలేపుతున్నాడని మండిపడుతూ కెసిఆర్ అసెంబ్లీలోకి అడుగుపెట్టిన రోజే అది ముఖ్యమంత్రికి చివరి రోజని,ఊరు ఊరునా కాంగ్రెస్కు పాడేగట్టి డప్పులు కొట్టిస్తామని హెచ్చరించారు.ఓటు నమోదు చేయించుకుని ఊరునే కబ్జా చేసిన చరిత్ర ఎమ్మెల్యే కవ్వంపల్లిదని, కవ్వంపల్లి కన్నా నాలుగు డిగ్రీలు ఎక్కువే చదవి పరిశోధనలపై డిగ్రీ కూడా చేశానని,గొంతులు కోయడానికే కవ్వంపల్లిని ప్రజలు ఎమ్మెల్యే చేశారా అని ప్రశ్నిస్తూ మాట్లాడే విధానం మార్చుకుని హామీలపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజలకిచ్చిన హామీలపై ప్రతిపక్ష హోదాలో ప్రశ్నించడమే తప్ప ఎవరిని విమర్శిస్తూ బిఆర్ఎస్ నాయకులు మాట్లాడలేదని,ఇప్పటికైనా జ్ఞానం తెచ్చుకొని ఉన్న కొద్దిరోజుల్లోనైనా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే కవ్వంపల్లికి రసమయి సూచించారు.అనంతరం నినాదాలతో ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, సిరిసిల్ల జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బిఆర్ఎస్ మండలాధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి,గంట మహిపాల్,గంప వెంకన్న, పార్టీ

సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్, ఏల శేఖర్ బాబు,ధీటి రాజు, లింగాల లక్ష్మణ్,రామంచ గోపాల్ రెడ్డి, పిట్టల మధు,నెల్లి మురళి,అడప శ్రీనివాస్, బూరుగుపల్లి చంద్రమౌళి,శామంతుల శ్రీనివాస్, ఆడెపు రమేష్, మునిగాల ప్రవీణ్ గౌడ్, సిరిశెట్టి రాజేందర్ గౌడ్, గుర్రం కిరణ్ గౌడ్ ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో సమావేశంలో పాల్గొన్నారు.

బిఆరెస్ అధినేత కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

ధర్మపురి, సెప్టెంబర్ 8, : జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో బిఆరెస్ అధినేత కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దగ్ధం చేశారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు తాతా మధు మరియు కేటీఆర్, హరీష్ రావు లు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్న సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన దానికి నిరసనగా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి బీ ఆర్ ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వైఖరి పై తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుండి దళితులను అవమానిస్తూనే ఉందని బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన పార్టీ టిఆర్ఎస్ పార్టీ అని అదేవిధంగా తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రి దళితుడైన రాజయ్య ని అకారణంగా బర్తరఫ్ చేయడం అదేవిధంగా సామాజిక ఉద్యమకారుడు తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలక పాత్ర వహించిన మందకృష్ణ మాదిగ ని అరెస్టు చేసి జైల్లో పెట్టిన పార్టీ టిఆర్ఎస్ పార్టీ ఈ విధంగా చెప్పుకుంటూ పోతే అనేక సందర్భాల్లో దళితులను అవమానించిన పార్టీ ఏదైనా ఉంది అంటే అది బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ అండ్ పార్టీ అని ఆయన ఎద్దేవా చేశారు. మొదటి నుండి దళితులను చిన్నచూపు చూస్తూ దళితులను అవమానించే వైఖరినీ సమాజం గమనిస్తుందని రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అసభ్య పదజాలంతో దూషించి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు పై చట్టరీత్యా చర్యలు గైకొని శాసనమండలి నుంచి ఆయన సభ్యత్వాన్ని రద్దుచేయాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అదేవిధముగా కేసీఆర్ కి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న స్పీకర్ పట్ల భారత రాజ్యాంగం పట్ల ఏ మాత్రం గౌరవం ఉన్న బీ ఆర్ ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్సీ తాత మధుని సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు. అదేవిధంగా పోలీసులను గల్లా పట్టి దూషించి, అవమాన పరిచిన కేటీఆర్, సిద్దిపేట శాసనసభ్యుడు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు టీషర్ట్ విప్పి మహిళా కానిస్టేబుల్ ముందు అర్ధ నగ్న ప్రదర్శన చేయడం వారి అవివేకానికి నిదర్శనమని వెంటనే

పోలీసులకు మరియు మహిళా సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కుంట సుధాకర్, చీపిరిశెట్టి రాజేష్, సంగ నర్సింలు, అప్పం తిరుపతి, జక్కు రవీందర్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్స్ సంఘీ ఆనంద్, ఒజ్జల లక్ష్మణ్, ముదుసుల ప్రశాంత్, అయ్యోరీ వేణు, సుముఖ్, దాసరి పురుషోత్తం, ఆశెట్టి శ్రీనివాస్, జాజల రమేష్, సీపతి సత్యనారాయణ, ఎండి. రఫీయొద్దీన్, చుక్క భీమరాజు, మొలగూరి రమేష్, దొనకొండ, నరేష్, బొల్లారం పోచయ్య, బత్తిని నరేష్, గుడ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ ధర్నాతో దద్దరిల్లిన మహేశ్వరం

సబితారెడ్డికి మద్దతుగా భారీగా తరలివచ్చిన బిఆర్ఎస్ మహిళలు

బహిరంగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందే

దాడి చేసిన వారిని శిక్షించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

మహేశ్వరం సెప్టెంబర్ 08 : ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పాటు మంత్రిగా పనిచేసి ప్రజలకు సేవలందించిన మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై దాడి చేయడం దుర్మార్గమైన చర్యని మహేశ్వరం నియోజకవర్గం కార్యదర్శి మూర్కుంట్ల అరవింద్ శర్మ, మహేశ్వరం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్ తీవ్రంగా మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోతు రాజు నాయక్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళ కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టపగలు అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను అవమానించిన చరిత్ర కేవలం రేవంత్ రెడ్డికే దక్కుతుందని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేల పై దాడి చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా ఎమ్మెల్యేలకు క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మహిళలు ఓట్లు వేస్తే గెలిచిన ముఖ్యమంత్రి మహిళలను గౌరవించాలని ఇంకిత జ్ఞానం లేకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సునీత లక్ష్మారెడ్డిపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో మూడేళ్లుగా రాక్షస పాలన కొనసాగుతుందని ఇప్పటికైనా సోహితెచ్చుకొని ప్రజా పాలన పేరు చెప్పుకొని గెలిచిన ముఖ్యమంత్రి ప్రజలకు సరైన రీతిలో సేవ చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కీచక పర్వాన్ని తెరలేపిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మి నరసింహ రెడ్డి, అర్కల కామేష్ రెడ్డి, రామిడి రామిరెడ్డి, జల్లెల లక్ష్మయ్య, పిఎసిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, కర్రొల చంద్రయ్య, అంబయ్య యాదవ్, పి సుధాకర్ రెడ్డి మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్, తో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు భారీగా పాల్గొన్నారు.

వ్యవసాయ బావులలో బోర్ లలో అడుగంటిన గ్రౌండ్ వాటర్

ఏఐపీకేఎంఎస్ జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 08: ఈ సంవత్సరం ఎనీనో వర్ష బావ పరిస్థితి వల్ల వర్షాలు రాక రైతాంగం చాలా ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితుల్లో ఒకనాడు నారా చంద్రబాబు నాయుడు కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకోండని రైతులు ను హరివాస పెట్టిన చంద్రబాబు నాయుడు కరెంటు ఉద్యమంలో ముగ్గురు వీరులు మరణించిన పరిస్థితి రాష్ట్రంలో ఉన్నది. అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతు ల కు ఉచిత కరెంటు ఇచ్చి కొంత ఉపశమనం కలిగించి నాడు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 24 గంటల కరెంటు ఇచ్చి రైతులని రారాజు చేసిన పరిస్థితి ఉన్నది. 2023లో కాంగ్రెస్ తెలంగాణలో అధికారం వచ్చినాక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు తీసుకొని రైతులని అరిగోస పెడుతున్న పరిస్థితి ప్రస్తుతం కొనసాగుతుందని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) అనుబంధ అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకే ఎంఎస్) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. మంగళవారం బచ్చోడు గ్రామంలో ఉదయం 5 గంటల నుండి 8 గంటల వరకు త్రీఫేస్ కరెంట్ కోసం రైతులు వేచి ఉన్నా కూడా మెసేజ్ రావట్లేదు త్రీ ఫేస్ కరెంటు రావట్లేదని రైతులు ఆందోళన చెందిన కరెంట్ అధికారుల్లో మానవత్వం లేని పరిస్థితి ఉన్నది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సమయపాలన పాటించి రైతులకు త్రీఫేస్ కరెంటు ఇవ్వాలని హనుమంతరావు డిమాండ్ చేశారు. ఇట్లాగే పరిస్థితి కొనసాగితే రేపు రాబోవు రోజుల్లో సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ (ప్రజాపంథా) ప్రజా పోరాటాలు ఉధృతం చేయాల్సిన పరిస్థితి ఉంటుందని తిమ్మిడి హనుమంతరావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూక్య రాంబాబు, రమేష్. దోతి సైదులు, బాలాజీ, గురువయ్య, ధరావ త్ తావురియా, సక్రాం, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ అందుకున్న రంగు మౌనిక

మానకొండూర్, సెప్టెంబర్8(: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన బిజెపి నాయకుడు, మాజీ ఎంపీటీసీ రంగు భాస్కరాచారి సోదరుని కుమార్తె రంగు మౌనికకు న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ వరించింది. మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా మౌనికకు డాక్టరేట్ పట్టాను అందజేశారు. 2015లో ఇదే కళాశాలలో ఎల్.ఎల్.బి, 2016లో నల్సార్ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్ఎం పూర్తి చేసి, 2026లో ఉస్మానియాలోని లా కళాశాలలో సీనియర్ ప్రొఫెసర్ జిబి రెడ్డి పర్యవేక్షణలో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ ఇన్ హైదరాబాద్ సిటీ ఏ లీగల్ స్టడీ అనే అంశంపై మౌనిక చేసిన పరిశోధనకు గాను విశ్వవిద్యాలయం పీహెచ్డీ డాక్టరేట్ ప్రధానం చేసింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సర్పంచ్ వాల ప్రదీప్ రావు, మాజీ ఎంపీటీసీ రంగు భాస్కరాచారి, గ్రామస్తులు మౌనికను అభినందించారు.

పింఛన్ల పేరుతో మహిళలను అవమానిస్తారా?

మాజీ ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లి ప్రతినిధి : పింఛన్లు ఇప్పిస్తామని ఆశ చూపి మహిళలను పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి అవమానించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. 14వ వార్డు కౌన్సిలర్ అస్లాం పర్వేజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనతో మంగళవారం పెద్దపల్లిలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళలకు నెలకు రూ.2,500 పింఛన్ వస్తుందని, దరఖాస్తు చేసుకునేందుకు ఇదే చివరి తేదీ అంటూ ఆశ చూపి కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి డ్రామాలు ఆడారని కౌన్సిలర్ అస్లాం పర్వేజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంతో మహిళలు తీవ్రంగా అవమానానికి గురయ్యారని ఆయన ఆరోపించారు. దీనికి నిరసనగా అస్లాం పర్వేజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు కలిసి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ముట్టడి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ అస్లాం పర్వేజ్కు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ముట్టడికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేయడంతో చివరకు ఆందోళనకారులు వెనుదిరిగారు. దీంతో కొంతసేపు నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయి.

పులిమామిడిలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

కందుకూరు, సెప్టెంబర్ 8, : కందుకూరు మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో అర్హత కలిగిన కుటుంబాలకు గ్రామ సర్పంచ్ ఎంబడి రమేష్ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేసి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డిజిటల్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాపగల రాములు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజా గౌడ్ గ్రామ జిపిఓ శ్రీహరి, వార్డు సభ్యులు పాపగల మహేష్, గంగదర్ రెడ్డి, రేషన్ కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు.

బదిలీ పై వెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం

రామగిరి, సెప్టెంబర్ 08: రామగుండం-త్రీ ఏరియా లోని ఎస్.ఎం.ఎస్ ప్లాంట్ నందు ప్రాజెక్ట్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తూ కొత్తగూడెం ఏరియా లోని వి.కె.ఉపరితల గని (ఓ.సి)కి ప్రాజెక్ట్ ఆఫీసర్గా బదిలీ పై వెళ్తున్న జి.శంకర్ ను రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, వివిధ విభాగాల అధిపతులు మంగళ వారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, బి.సుదర్శనం, కె.ఐలయ్య , సి.జె.సురేఖ, రవికుమార్, ఆర్.రాజేశ్వరి, ఆసిఫ్ యాసిన్, జ్ఞానసంబంధన్, కోల శ్రీనివాస్, మేఘన,డివై పియం ఎన్. వంశీధర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరిన టిఇపిఏ వ్యవస్థాపకులు ధార మధు

రామగిరి, సెప్టెంబర్ 08:- తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పి)లో తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఇపిఏ) వ్యవస్థాపకులు ధార మధు చేరారు. సోమవారం హైదరాబాద్లో టిఆర్పి వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ధార మధు పార్టీలో చేరడంతో విద్యా రంగంలో టిఆర్పి మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ సమస్యలపై ధార మధు చేస్తున్న కృషి పార్టీకి మరింత ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధార మధుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జెంకిలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

బెజ్జంకి, సెప్టెంబర్8 : సిద్దిపేట జిల్లా బెజ్జెంకి ఎక్స్ రోడ్డు వద్ద బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానానికి నిరసనగా బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి దిష్టి బొమ్మను దహనం చేశారు.పార్టీ మండలాధ్యక్షుడు పాకాల మైపాల్రెడ్డి మాట్లాడుతూ.... దేవాలయంలాంటి అసెంబ్లీ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మహిపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రావుల రామకృష్ణారెడ్డి, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, రాజయ్య, ఎల శేఖర్బాబు , అనిల్ , బాబు గాజరాజు, నరేష్, సురేష్, మొండయ్య, సంపత్, తదితర బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు.

గోదావరి, సాగర్ జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలి

● **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 08: సాగర్, గోదావరి జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతతో కాపాడుకోవాలని, రైతులు నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం ఎన్ఎస్పీ కాల్వ లింకు కెనాల్ పునరుద్ధరణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగర్ జలాల ప్రవాహాన్ని పరిశీలించి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువుకు నీటి సరఫరా జరిగే కాలువ, తూము మరమ్మత్తు పనుల పై మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కాలువ పరిస్థితి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువు వరకు ఉన్న దూరం, నీటి సాఫీగా ప్రవహించేందుకు అనువైన పరిస్థితులు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరితగతిన కాలువ, తూము పునరుద్ధరణ పనులను పూర్తిచేయాలని, త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలం పరిధిలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పై ఆరా తీశారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఏ ఒక్కరు మిస్ కాకుండా ప్రతి ఒక్కరిని హియరింగ్ కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు సైతం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద జలాల పరిస్థితిని పరిశీలించారు. అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గోదావరి, సాగర్ నుంచి తరలిస్తున్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించాలని, త్రాగునీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రాధాన్యత క్రమంలో నీటిని వినియోగించాలని అన్నారు. వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. నీటి

ప్రవాహాల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేయాలని, నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇర్రిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్, వైరా ఈఈ బాబురావు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్లు వినయేందర్ రెడ్డి, అరుణ, ఇరిగేషన్ ఏఈ విక్రమ్ తో పాటు పలువురు మున్సిపల్, ఇరిగేషన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేస్తారు.. కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేయరా..?

- అధికార పార్టీకి కొమ్ము కాస్తున్న పోలీస్ అధికారులు - బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలి:మంద సంజీవరెడ్డి

బోడుప్పల్: : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి మేడిపల్లి పోలీసులను డిమాండ్ చేశారు. హౌస్ అరెస్ట్‌లో ఉన్న మంద సంజీవరెడ్డి మీడియాతో మాట్లాడుతూ..బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు చేపడుతుంటే పోలీసులు వారిని అక్రమంగా హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు.అదే సమయంలో కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో పాటు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. "బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు..కాంగ్రెస్ నాయకులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు..?"అని ఆయన ప్రశ్నించారు.అధికార పార్టీకి పోలీసులు కొమ్ముకాస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని,కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిని గుర్తించి తక్షణమే అరెస్ట్ చేయాలని మంద సంజీవరెడ్డి డిమాండ్ చేశారు.ఈ ఘటనలకు సంబంధించిన ఆధారాలు,సమాచారాన్ని మేడిపల్లి సీఐకి అందించినట్లు తెలిపారు.ఘటనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్, బందారం శ్రీధర్ గౌడ్,కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

● **మహిళలని చూడకుండా చిత్రహింసలకు గురి చేయడం సిగ్గు చేటు ● ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుండ్లు ● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

రామగిరి, సెప్టెంబర్ 08:- పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలన లో అమలు చేయని 420 హామీలు, ఆరు గ్యారంటీల పై బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని కి వినతి పత్రం అందజేసి మరియు మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసుల తీరును ఖండిస్తూ నిరసన కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా భీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ లతో కలిసి పాల్గొని అనంతరం అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని విమర్శించారు. ఆడబిడ్డల వివాహాల కోసం కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని అన్నారు. విద్యార్థుల పైచదువుల కోసం రూ.ఐదు లక్షల ఏటీఎం కార్డులు ఇస్తామని చెప్పిన హామీని కూడా అమలు చేయలేదన్నారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను ఉపయోగించుకుని మోసం చేశారన్నారు.యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. పెద్దపల్లి పట్టణం మధ్యలో బస్సు డిపో నిర్మించడం వల్ల ప్రజలకు శబ్ద కాలుష్యంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, బస్సు డిపోను పట్టణానికి బయట ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బస్టాండ్ సమీపంలోని ప్రాంతాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని, అక్కడ ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు లేదా జిల్లా కోర్టు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశామని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, పింఛన్లను రూ.1,000 నుంచి రూ.2,000కు పెంచడం, రోడ్ల నిర్మాణం, చెరువుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామన్నారు, కాల్వశ్రీరాంపూర్‌లో సుమారు 950 ఇళ్ల నిర్మాణం, పెద్దపల్లిలో ఇళ్ల నిర్మాణంతో పాటు దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో అద్భుతమైన కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు, కాంగ్రెస్ ప్రభుత్వం

ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా బీఆర్ఎస్ నాయకులు వెనక్కి తగ్గబోరని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజల తరఫున, మహిళల తరఫున నిరంతరం పోరాడుతూనే ఉంటారని స్పష్టం చేశారు.

బోడుప్పల్‌లో ఉద్రిక్తత

బీఆర్ఎస్ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ శ్రేణుల యత్నం.. అడ్డుకున్న పోలీసులు

బోడుప్పల్:: బోడుప్పల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ కార్యాలయం వైపు కాంగ్రెస్ శ్రేణులు దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు భారీగా మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.దీంతో కొద్దిసేపు బీఆర్ఎస్ కార్యాలయం పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తాత మధు దిష్టిబొమ్మ దహనం..

● **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు బహిరంగ క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్ నాయకుల డిమాండ్..**

బోడుప్పల్: : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత,అహంకారపూరిత వ్యాఖ్యలను నిరసిస్తూ బోడుప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం వద్ద,అలాగే బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. బోడుప్పల్ డివిజన్--11 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు.స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్, చెంగిచెర్ల మాజీ కార్పొరేటర్లు, కాంటెస్ట్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్, మేడ్చల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర రాహుల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అసర్ల బీరప్ప,బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దుల శ్రీకాంత్, మైనారిటీ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత యాదవ్,మహిళా కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 08: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలో దివ్యాంగుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస పాల్గొని దివ్యాంగులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దివ్యాంగజన్ కౌశల్ వికాస్ పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి అవకాశాలను దివ్యాంగజన్ రోజ్‌గార్ సేతు ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులు, రక్షణలు, సమాన అవకాశాల గురించి వివరించారు. దివ్యాంగుల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకొని సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురై నప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం మరియు న్యాయ సలహా అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఎ. ప్రమీల, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదులు, సంబంధిత శాఖ సిబ్బంది మరియు దివ్యాంగులు పాల్గొన్నారు.

అందుకే శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్సీ ఇచ్చాం

మూడు ఫార్మాట్లలో ఆడగలిగే సామర్థ్యం ఉండటంతోనే టీమిండియా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. టీమిండియా టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్‌ను నియమించిన భారత సెలెక్షన్ కమిటీ.. వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. టీ20 ప్రపంచకప్ 2024లో రోహిత్ శర్మకు డిప్యూటిగా వ్యవహరించిన హార్దిక్ పాండ్యాను సెలెక్టర్లు సారథ్య బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించారు. అతని ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని అగార్కర్‌తో పాటు నయా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. శ్రీలంక పర్యటనకు వెళ్లే ముందు సోమవారం ఈ ఇద్దరూ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ పర్యటనకు ఎంపిక చేసిన టీ20, వన్డే జట్లుకు సంబంధించిన వివరాలతో పాటు, భవిష్యత్తు ప్రణాళికలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు గంభీర్, అగార్కర్ ఓపికగా సమాధానాలు ఇచ్చారు. ఈ క్రమంలోనే శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్సీ చేయడం వెనుక ఉన్న కారణాన్ని అజిత్ అగార్కర్ వెల్లడించాడు. 'మూడు ఫార్మాట్లు ఆడే సామర్థ్యం శుభ్‌మన్ గిల్‌కు ఉందని మేం భావించాం. గతేడాదిగా అతను నిలకడగా రాణిస్తున్నాడు. దాంతోనే అతన్ని భవిష్యత్తు సారథిగా తీర్చిదిద్దాలని మేం భావించాం. సీనియర్ల నుంచి పాఠాలు నేర్చుకునేలా వైస్ కెప్టెన్సీ అవకాశం ఇచ్చాం. సూర్య, రోహిత్‌లకు డిప్యూటీగా శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ పాఠాలు నేర్చుకుంటాడు. కెప్టెన్ గాయపడినా.. ఫామ్ కోల్పోయినా.. ఆకస్మాత్తుగా కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసే సవాల్‌ను మళ్లీ ఎదుర్కోవద్దనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే శుభ్‌మన్ గిల్ తన సారథ్య ప్రతిభను చాటుకున్నాడు. దాంతోనే అతనికి కొంత అనుభవం కావాలని భావించాం. జీవితంలో ఎలాంటి గ్యారంటీలు ఉండవు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అతనే సరైనోడనిపించింది.'అని అజిత్ అగార్కర్ చెప్పుకొచ్చాడు. శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్‌గా.. వైస్ కెప్టెన్‌గా జట్టును నడిపించిన అనుభవం ఉంది. భారత్ గెలిచిన 2018 అండర్ 19 ప్రపంచకప్‌లో పృథ్వీ షాకు శుభ్‌మన్ గిల్ డిప్యూటీగా వ్యవహరించాడు. దేశవాళీ క్రికెట్‌లోనే కెప్టెన్సీ చేశాడు. డియోధర్ ట్రోఫీలోనూ ఓ జట్టుకు సారథ్యం వహించాడు. ఇటీవల జింబాబ్వే పర్యటనలో టీమిండియాను అద్భుతంగా నడిపించి 4-1తో సిరీస్ గెలిచాడు. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ.. వన్డే, టెస్ట్‌ల్లో కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. సూర్యకుమార్ యాదవ్ టీ20ల్లో టీమిండియాను నడిపించనున్నాడు. సూర్య.. టీ20లు మాత్రమే ఆడుతాడని అగార్కర్ స్పష్టం చేశాడు. సూర్య ఇప్పటికే 7 మ్యాచ్‌ల్లో జట్టును నడిపించి 5 విజయాలు అందించాడు.

స్పోర్ట్స్

జో రూట్ సచిన్ టెస్టు స్కోరును అధిగమిస్తాడు

టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ టెండ్యూలర్ ఉన్న విషయం తెలిసిందే. 200 టెస్టుల్లో 15921 పరుగులు చేశాడు. సచిన్ దరిదాపుల్లో కూడా ఎవరూ లేరు. ప్రస్తుత క్రికెటర్లలో ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ మాత్రమే కాస్త దగ్గరగా ఉన్నాడు. ఇప్పటివరకు 142 టెస్టులు ఆడిన రూట్.. 11,940 పరుగులు చేశాడు. తాజాగా విండీస్‌పై రెండో టెస్టులో రూట్ సెంచరీ బాదాడు. దీంతో భవిష్యత్తులో సచిన్ రికార్డును అధిగమించే సత్తా రూట్‌కు మాత్రమే ఉందని ఇంగ్లీష్ మాజీ కెప్టెన్, కామెంటేటర్ మైకెల్ వాన్ అన్నాడు. విరాట్ కోహ్లీ, కేన్ విలియమ్సన్ వల్ల కాదని వ్యాఖ్యానించాడు. 'రాబోయే కొన్ని నెలల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా జో రూట్ నిలుస్తాడు. అలెస్టర్ కుక్ (12,472) కంటే కొద్దిలోనే వెనుక ఉన్నాడు. భవిష్యత్తులో సచిన్ టెండూల్కర్ రికార్డునూ అధిగమిస్తాడు. రూట్ గతంలో మాదిరిగా ఆచితూచి ఆడటం లేదు. దూకుడుగానే రన్స్ చేస్తున్నాడు. రూట్ నాణ్యమైన క్రికెట్ ఆడుతున్నాడు' అని టెలిగ్రాఫ్ కాలమ్‌లో మైకెల్ వాన్ రాసుకొచ్చాడు. వెస్టిండీస్‌పై రెండో టెస్టులో ఇంగ్లీష్ జట్టు 241 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. 384 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ 143 పరుగులకే ఆలౌటైంది.

నూతన న్యాయ చట్టాలపై మీ వైఖరేంటి

ప్రభుత్వానికి బిఆర్ఎస్ నేత కెటిఆర్ లేఖ

హైదరాబాద్,జూలై22 : దేశంలో అమలులోకి వచ్చిన నూతన న్యాయ చట్టాలపైన రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి వెల్లడించాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. వివిధ వర్గాల నుంచి కొత్త న్యాయ చట్టాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టాలలో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్చను హరించేలా ఉన్నాయి. నూతన చట్టాల్లో పేర్కొన్న అనేక సెక్షన్ల వల్ల రాష్ట్రంలో పోలీస్ రాజ్యాన్ని తీసుకువచ్చే ప్రమాదం ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తు న్నారు. నూతన చట్టాలపైన విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో వీటిపైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.ప్రజా ఉద్యమాలకు దశాబ్దాలుగా కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న తెలంగాణ గడ్డపైన నిరంకుశ, నియంతృత్వ నూతన క్రిమినల్ చట్టాలను ఇక్కడ యధాతథంగా అమలు చేయడమే రాష్ట్ర సర్కారు లక్ష్యమా? లేక తమిళనాడు, కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మాదిరిగా సవరణలు తీసుకొస్తారా అనే విషయాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేయాలి. ఇప్పటికైనా రేవంత్ సర్కారు వెంటనే తన నిర్ణయాన్ని ప్రకటించాలి. నూతన చట్టాల్లో ఉన్న నియంతృత్వ పూరిత సెక్షన్లను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలి. దీంతో పాటు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రం తరఫున ఒక తీర్మానాన్ని కేంద్రానికి పంపించాలి. లేకుంటే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు నిరంకుశ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా పరిగణిస్తారని గుర్తుంచుకోవాలి అని కేటీఆర్ సూచించారు.

బూ కబ్జాదారుల భరతం పట్టాలి

సిపిఐ నేత నారాయణ డిమాండ్

అమరావతి,జూలై22 : అన్నమయ్య జిల్లా మదనపల్లెలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని ÷ల్స్ తగలబెట్టి భూకబ్జాదారుల్ని కాపాడే ప్రయత్నం జరిగిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. అది షార్ట్‌సర్క్యూట్ కాదని, ఫైల్స్ తప్ప ఆఫీసు దగ్ధం కాలేదన్నారు. సీపీఐ నాయకుడు మురళి గత నాలుగైదు నెలలుగా అనేక భూకబ్జాలను వెలికితీశారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని తెలిసి పర్యాటక శాఖ కార్యాలయాన్ని తగలబెట్టారని చెప్పారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, జోక్యం చేసుకొని భూకబ్జాదారులను బయటపెట్టాలని నారాయణ డిమాండ్ చేశారు.

పంత్ రికార్డ్ బద్దలు కొట్టిన రిచా ఘోష్!

టీమిండియా మహిళా బ్యాటర్, వికెట్ కీపర్ రిచా ఘోష్ చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ టీ20ల్లో భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో హాఫ్ సెంచరీ నమోదు చేసిన వికెట్ కీపర్‌గా రికార్డ్ నమోదు చేసింది. మహిళల ఆసియా కప్ 2024లో భాగంగా ఆదివారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఫిఫ్టీ చేయడంతో రిచా ఈ ఘనత అందుకుంది. యూఏఈపై రిచా 29 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్‌తో 64 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. రిచా ఘోష్ 20 ఏళ్ల 297 రోజుల వయసులో అంతర్జాతీయ టీ20 హాఫ్ సెంచరీ నమోదు చేసింది. దాంతో టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ రికార్డును బద్దలు కొట్టింది. పంత్ 21 ఏళ్ల 206 రోజుల వయసులో టీ20 హాఫ్ సెంచరీ సాధించాడు. 2019లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో పంత్ ఈ ఘనతను అందుకున్నాడు. అంతేకాదు మహిళల ఆసియా కప్ చరిత్రలో హాఫ్ సెంచరీ సాధించిన తొలి వికెట్ కీపగా రికార్డుల్లో నిలిచింది. రిచా ఇప్పటివరకు 2 టెస్టులు, 23 వన్డేలు, 52 టీ20లు భారత్ తరఫున ఆడింది. టీ20ల్లో ఇదే మొదటి ఫిఫ్టీ కావడం విశేషం. రిచా ఘోష్ విధ్వంసకర హాఫ్ సెంచరీతో భారత్ భారీ స్కోర్ చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్స్ కోల్పోయి 201 పరుగుల భారీ స్కోర్ చేసింది. రిచా సహా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (66) హాఫ్ సెంచరీ చేసింది. టీ20 క్రికెట్‌లో భారత మహిళల జట్టుకు ఇదే అత్యధిక స్కోర్. చేధనలో యూఏఈ 7 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసి 78 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. కవిషా (40 నాటౌట్) టాప్ స్కోరర్.



హాకీ జట్టు గోల్‌కీపర్, మాజీ కెప్టెన్ పీఆర్ శ్రీజేశ్ సంచలన నిర్ణయం

భారత పురుషుల హాకీ జట్టు గోల్‌కీపర్, మాజీ కెప్టెన్ పీఆర్ శ్రీజేశ్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అప్‌కమింగ్ పారిస్ ఒలింపిక్స్ 2024 తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. ఇప్పటికే మూడు సార్లు ఒలింపిక్స్ బరిలో నిలిచిన శ్రీజేశ్.. పారిస్ ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రదర్శన చేసి కెరీర్‌కు గుడ్‌బై చెప్పాలనుకుంటున్నాడు. 'పారిస్ ఒలింపిక్స్‌తో నా కెరీర్‌కు వీడ్కోలు పలికేందుకు సిద్ధమయ్యా. ఒలింపిక్స్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. నా కెరీర్‌కు అండగా నిలిచిన నా కుటుంబ సభ్యులు, సహచరులు, కోచ్‌లు, భారత హాకీ జట్టు అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు. నాపై విశ్వాసం ఉంచిన అందరికీ కృతజ్ఞతలు. నా సహచర ఆటగాళ్లు బాధ, సంతోష సమయాల్లో పక్కనే ఉన్నారు. మేమందరం పారిస్ ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం. కచ్చితంగా మా పతకం రంగును మార్చాలనే లక్ష్యంతో ఉన్నాం.'అని పీఆర్ శ్రీజేశ్ పేర్కొన్నాడు. 2010 హాకీ ప్రపంచకప్‌తో కెరీర్ ప్రారంభించిన 36 ఏళ్ల శ్రీజేశ్.. ఇప్పటి వరకు 328 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి భారత్ సాధించిన ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమయ్యాడు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ టీమ్ బ్రాంజ్ మెడల్ గెలిచిన విషయం తెలిసిందే. ఈ కాంస్య పతకం గెలవడంలో శ్రీజేశ్ కీలక పాత్ర పోషించాడు. గోల్ పోస్ట్‌కు హీరోలా అడ్డుగా నిలిచి అనేక గోల్స్ ఆపాడు. జూలై 26 నుంచి ఆగస్ట్ 11 వరకు పారిస్ ఒలింపిక్స్ జరగనుండగా.. భారత్ హాకీ టీమ్ తొలి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో జూలై 27న ఆడనుంది. అర్జెంటీనాతో జూలై 29న, బెల్జియంతో ఆగస్ట్ 1న, ఆస్ట్రేలియాతో ఆగస్ట్ 2న తలపడనుంది.

టీమిండియా తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులే

శ్రీలంకతో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడేందుకు భారత్ జట్టు నేడు అక్కడికి బయల్దేరనుంది. జూన్ 27 నుంచి టీ20 సిరీస్, ఆగష్టు 2 నుంచి వన్డే సిరీస్ ఆరంభం కానుంది. ఈ పర్యటనలో టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు తీసుకోనున్నాడు. అయితే హెడ్ కోచ్‌గా గౌతమ్ ఎంపికయినా.. సహాయక సిబ్బంది ఎవరనే ఉత్కంఠ ఇంకా కొనసాగుతోంది. గౌతీ సిఫార్సు చేసిన జాబితాలో కొందరికి బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. మరికొందరిని మాత్రం అంగీకరించట్లేదు. త్వరలోనే దీనిపై క్లారిటీ రానుంది. టీమిండియా అసిస్టెంట్ కోచ్‌లుగా అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డస్కాటెల ఎంపిక దాదాపు ఖాయమైందని తెలుస్తోంది. బౌలింగ్ కోచ్ నియామకం మాత్రం ఇంకా పూర్తి కాలేదు. బౌలింగ్ కోచ్ రేసులో భారత మాజీ పేసర్లు ఆర్ వినయ్ కుమార్, లక్ష్మీపతి బాలాజీలతో పాటు దక్షిణాఫ్రికా దిగ్గజం మోర్నీ మోర్కెల్ రేసులో ఉన్నారు. గంభీర్ మాత్రం మోర్నీనే కావాలని బీసీసీఐతో చెప్పాడట. బౌలింగ్ కోచ్ విషయంలో భారత మాజీ క్రికెటర్లనే ఎంపిక చేయాలని బీసీసీఐ భావించినా.. గౌతీ మాత్రం మోర్నీనే కావాలంటున్నాడట. దాంతో శ్రీలంక టూర్ కోసం తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులేని బీసీసీఐ నియమించింది. ఇంతకీ ఎవరీ బహుతులే అని నెటిజన్స్ నెట్టింట ఆరా తీస్తున్నారు. భారత్ తరఫున సాయిరాజ్ బహుతులే 2 టెస్టులు, 8 వన్డేలు ఆడారు. 1997లో భారత్ తరఫున అరంగేట్రం చేసిన బహుతులే.. రెండు ఫార్మాట్‌లలో కలిపి 5 వికెట్లు పడగొట్టి, 62 రన్స్ చేశారు. లెగ్ స్పిన్నర్ అయిన బహుతులేకు కోచ్‌గా మంచి అనుభవం ఉంది. 2014లో కేరళ క్రికెట్ జట్టుకు, 2015లో బెంగాల్ క్రికెట్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2018 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్నారు. ప్రస్తుతం బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఆయన సేవలు అందిస్తున్నారు. శ్రీలంక పర్యటన అనంతరం బహుతులే తిరిగి ఎన్‌సీఏకు చేరనున్నారు. లంక పర్యటన లోగా బీసీసీఐ సహాయక సిబ్బంది ఎంపిక పూర్తవుతుంది.

విశ్వజి

వడగాలులతో గుండె దడ!

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా, వడగాలులతో గుండె, ఊపిరితిత్తులు దెబ్బతినే ప్రమాదం ఉన్నదని అంటున్నారు. అధిక వేడి వాతావరణంలో శరీర ఉష్ణోగ్రత తనను తాను నియంత్రించుకునే లక్షణం చెదిరిపోతుందని చెబుతున్నారు. వడదెబ్బతో రక్తపోటు తగ్గుతుంది. ఫలితంగా, ముఖ్యమైన అవయవాలకు తగినంతగా రక్తం సరఫరా కాదు. గుండెపై ఒత్తిడి పెరిగి.. గుండెదడ లాంటి సమస్యలూ వస్తాయి. కొన్ని సందర్భాల్లో రక్త ప్రసరణ తగ్గి.. గుండె కండరాలు దెబ్బతినే అవకాశం కూడా ఉంటుంది. దీర్ఘకాలంలో హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఇక వడగాలులతో ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరిగి.. శ్వాసకోస సమస్యలు చుట్టుముడతాయి. ముఖ్యంగా, ఆస్తమా లాంటి దీర్ఘకాలిక శ్వాస సంబంధ వ్యాధులతో బాధపడుతున్నవారిని మరింతగా ఇబ్బందిపెడతాయి. వీరిలో శ్వాస ఆడకపోవడం, గురక, దగ్గుకు కారణం అవుతుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే.. ఊపిరితిత్తుల వాపు, న్యుమోనియాకూ దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సురక్షితంగా ఉండాలంటే..

పగటి వేళలో ప్రతి 20 %–% 30 నిమిషాలకు ఓసారి గ్లాసెడు నీళ్లు తాగాలి.

వేడి ఎక్కువగా ఉండే సమయాల్లో శ్రమతో కూడిన పనులకు దూరంగా ఉండాలి.

హృదయ, శ్వాసకోశ సమస్యలు ఉన్నవాళ్లు తమ లక్షణాలను నిశితంగా గమనిస్తుండాలి. అవి తీవ్రమైతే వెంటనే వైద్యులను ఆశ్రయించాలి.

బ్యూటీ సీక్రెట్

పాదాల పగుళ్లను తగ్గించడంలో పసుపు నూనె అద్భుతంగా పనిచేస్తుంది. కొబ్బరినూనె లేదా ఆముదం నూనెలో రెండు చుక్కల పసుపు నూనె కలిపి.. ఆ మిశ్రమంతో పాదాలను మృదువుగా మసాజ్ చేసుకోవాలి. ఈ టిప్‌ను రెగ్యులర్‌గా ఫాలో అయితే.. పగుళ్లు తగ్గడంతోపాటు పాదాలు కూడా మృదువుగా తయారవుతాయి.

ఇవి ట్రై చేయండి, షుగర్ పెరగమన్నా పెరగదు..!!

మధుమేహం. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా కోట్లాది మందిని వెంటాడుతున్న సమస్య. షుగరు వచ్చిందంటే శరీరం మొత్తం ప్రభావితం అవుతుంది. ఏ ఒక్క భాగానికో కాదు. ప్రతీ అవయవం మీద తన శక్తిని చూపిస్తుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ముప్పు తప్పదు. మధుమేహానికి నియంత్రణ మాత్రమే సరైన మందు. మదుమేహ బాధితులకు ఆహారం.. జీవనశైలి అన్నింటి కంటే ముఖ్యం. ఇక, చిన్నపాటి చిట్కాలు.. ఆహారంలో మార్పులతో మధుమేహాన్ని నియంత్రించుకొనే అవకాశం ఉంది. రుచిని అందిస్తూనే షుగరు పెరగకుండా కడుపు నింపే ఆహారాలు మధుమేహ బాధితులకు ఎంతో మేలు చేస్తాయి మధుమేహం ఉంటే మధుమేహ నిర్వహణ లో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. అధిక ఫైబర్ మరియు తక్కువ గ్లైసెమిక్ సూచిక ఉన్న ఆహారాలు అనుకూలంగా ఉంటాయి. దక్షిణ భారతీయ వంటకాలు, అనుసరించినప్పుడు, ఈ ఆహార అవసరానికి సరిపోతాయి. ఇందుకు సంబంధించి ఆహార ఎంపికల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇడ్లీ, రాగి లేదా ఓట్స్ వంటి సంపూర్ణ ధాన్యాలతో వీటిని తయారు చేయవచ్చు. ఈ ప్రత్యామ్నాయాలు సాంప్రదాయ బియ్యం ఇడ్లీల కంటే ఎక్కువ ఫైబర్ అందిస్తాయి. దోశలను కూడా పోషక విలువను పెంచడానికి మల్టిగ్రైన్ పిండి ఉపయోగించి తయారు చేయవచ్చు. %నూశ్రీంశీ =ము౦% "మైగ్రేన్ తలనొప్పి వేధిస్తుందా? కారణాలు, లక్షణాలు, నివారణలు ఇవే!" మధ్యాహ్న భోజనం దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువగా సాంబార్ వినియోగిస్తారు. ఇది సహజంగానే ఆరోగ్యకరం. పప్పులు ,కూరగాయలను కలిగి ఉంటుంది, ఇవి ఫైబర్‌లో సమృద్ధిగా ఉంటాయి. నూనె పరిమాణాన్ని తగ్గించడానికి, తాలింపు తక్కువ నూనెతో లేదా ఎయిర్ ఫ్రయర్ ఉపయోగించి చేయవచ్చు. సాంబార్ తీసుకురావడానికి తెల్ల బియ్యం స్థానంలో బ్రౌన్ రైస్ ఎంచుకుంటే ప్రయోజనం ఉంటుంది. కూరగాయల కర్రీలు అదనపు పోషకాల కోసం పాలకూర లేదా మెంతి వంటి ఆకుకూరలను వినియోగించాలి. గ్రేవీలలో కొబ్బరి పాలను తక్కువ కొవ్వు పెరుగు తో మార్చవచ్చు. అదే విధంగా మధు మేహ బాధితులు స్నాక్స్ గా వడలు వంటి స్నాక్స్ తక్కువ కేలరీ పరిమాణం కలిగినవి తీసుకోవచ్చు. ఎక్కువగా గ్లెమిక్సిన్ లేని పదార్థాలతో తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలి. %ూశీషవతీవస దీఎ% పాయసం వంటి సాంప్రదాయ స్వీట్ ను స్టీవియా, బెల్లం వంటి సహజ ప్రత్యామ్నాయాలతో తయారు చేసుకోవచ్చు. దీని ద్వారా సహజ సిద్ధమైన తియ్యదనం వస్తుంది. పూర్తి క్రీమ్ పాల స్థానంలో స్కిమ్డ్ పాలు ఉపయోగించడం కొవ్వు పరిమాణాన్ని తగ్గించటంతో పాటుగా రుచిని కూడా ఇస్తుంది. ఇలా, ప్రాసెస్ చేసిన ఫుడ్ .. చెక్కెర ఉన్న పదార్థాలు.. నిల్వ ఉన్న వాటికి దూరంగా ఉంటూ.. సరైన జీవన శైలిని.. వ్యాయామంతో జత చేసి.. ఆహారంలో సరైన పద్దతులను అలవాటు చేసుకుంటే మధుమేహ బాధితులకు షుగరు లెవల్స్ పెరగకుండా నియంత్రించుకోవచ్చు.

వేసవిలో శక్తినిచ్చే సూపర్ ఫుడ్స్ ఇవే!

చాలామంది వేసవికాలంలో ఎండ దెబ్బకు శరీరం డిహైడ్రేట్ అయ్యి శక్తిని కోల్పోయి నీరసంగా ఫీల్ అవుతూ ఉంటారు. అటువంటివారు సమ్మర్లో రోజంతా చురుకుగా ఉండడానికి శక్తినిచ్చే ఆరు రకాల సూపర్ ఫుడ్స్ ను తింటే మంచిదని డైటీషియన్లు చెప్తున్నారు. ఇక ఆ సూపర్ ఫుడ్స్ ఏంటి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. అరటి పండ్లు అరటి పండ్లు మంచి పోషకాలతో కూడుకున్న ఆహారం. అరటి పండ్లలో పొటాషియం, కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి కావలసిన శీఘ్ర శక్తిని అందిస్తాయి. వీటిని ప్రీ వర్కవుట్ ఫుడ్ గా కూడా తీసుకోవచ్చు. గ్రీన్ టీ గ్రీన్ టీ కూడా మనకు శరీరానికి కావలసిన శక్తిని ఇస్తుంది. గ్రీన్ టీ తాగితే ఇది మన శరీరంలో అలసటను తగ్గించి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు శక్తి స్థాయిలను కూడా ఇది పెంపొందిస్తుంది. కనుక ఈ సీజన్ లో గ్రీన్ టీ తాగడం ఎంతో మంచిది. పాలకూర పాలకూరలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఎవరైతే తక్కువ ఐరన్ స్థాయిలు కలిగి ఉంటారో వారు శక్తి హీనులుగా ఉంటారు. ఇక శక్తి వంతులుగా ఉండాలంటే కచ్చితంగా ఆహారంలో పాలకూరని భాగంగా చేసుకోవడం సూచించదగింది. చియా సీడ్స్ చియా సీడ్స్ ను కూడా మనం ఒక సూపర్ ఫుడ్ గా చెప్పుకోవాలి. చియా సీడ్స్ ను నానబెట్టి తీసుకోవడం వల్ల శక్తి వస్తుంది. ఇందులో ఉండే ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ మన శరీరానికి కావాల్సిన ఎనర్జీని ఇచ్చి ఎంతగానో దోహదం చేస్తాయి. డార్క్ చాక్లెట్ డార్క్ చాక్లెట్ చిన్న ముక్కను ప్రతిరోజు తింటే మన శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్లను శరీరానికి అందిస్తుంది. అలసటను తగ్గించి శక్తిని పెంచుతుంది. దృష్టిని కూడా మెరుగుపరుస్తుంది. ఓట్స్ ఓట్స్ లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఓట్స్ తిన్న తర్వాత మన శరీరంలో శక్తి పెరుగుతుంది. ఇక ఎండాకాలంలో అలసటతో బాధపడేవారు, శక్తి తక్కువగా ఉందని ఇబ్బంది పడేవారు,

ఈ అలవాట్లను మార్చుకోకపోతే.. డాక్టర్లు కూడా మిమ్మల్ని రక్షించలేరు!

బరువు పెరగడం అనేది చాలా మందిని వేధించే సమస్య. కొందరికి ఇది ఆరోగ్య సమస్యల కారణంగా సంభవించినప్పటికీ, ఎక్కువ మందికి వారి రోజువారీ అలవాట్లే ప్రధాన కారణం. మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యంగా తీసుకునే ఆహారం, జీవనశైలిలో మార్పులు క్రమంగా మన బరువును పెంచుకుంటూ పోతాయి. ఈ బరువు పెంచే అలవాట్లను గుర్తిస్తే, మనం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు. జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్: మొదటగా ఆహారం విషయానికి వస్తే, చాలా మంది సమయం లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల సరైన ఆహారం తీసుకోరు. దీనికి బదులుగా జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ లేదా అధిక కేలరీలు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటారు. పిజ్జాలు, బర్గర్‌లు, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహారాల్లో కేలరీలు, కొవ్వులు , చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోయినా, అధిక మొత్తంలో కేలరీలు మాత్రం చేరుతాయి. ఇది క్రమంగా బరువు పెరగడానికి దారితీస్తుంది. భోజనం చేసే వేళల్లో మార్పులు: తరువాత, చాలా మందికి భోజనం చేసే వేళలు కూడా సరిగా ఉండవు. ఒకరోజు ఉదయం 8 గంటలకు తింటే, మరోరోజు 11 గంటలకు తినడం వల్ల జీర్ణక్రియ వ్యవస్థ గందరగోళానికి గురవుతుంది. అంతేకాకుండా, చాలా మంది రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేస్తారు. రాత్రిపూట జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది కాబట్టి, ఆహారం సరిగ్గా జీర్ణం కాక కొవ్వుగా మారే అవకాశం ఉంది. నిద్రపోయే ముందు భారీగా తినడం కూడా బరువు పెరగడానికి ఒక ముఖ్య కారణం. శీతల పానీయాలు: ఇక పానీయాల విషయానికి వస్తే, చాలా మంది శీతల పానీయాలు, చక్కెర కలిపిన జ్యూస్‌లు , ఇతర తీపి పానీయాలను ఎక్కువగా తాగుతారు. వీటిలో కేలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి, కానీ పోషక విలువలు మాత్రం శూన్యం. వీటిని తాగడం వల్ల కడుపు నిండిన భావన కలగదు, కానీ శరీరానికి మాత్రం అధిక మొత్తంలో చక్కెర చేరుతుంది. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీసి, బరువు పెరగడానికి కారణమవుతుంది. నీరు తక్కువగా తాగడం కూడా బరువు పెంచే అలవాట్లలో ఒకటి. నీరు జీవక్రియను మెరుగుపరచడానికి మరియు ఆకలిని నియంత్రించడానికి సహాయపడుతుంది. కాబట్టి, తగినంత నీరు తాగకపోతే శరీరం డీహైడ్రేషన్‌కు గురవ్వడమే కాకుండా, బరువు కూడా పెరిగే అవకాశం ఉంది.

మార్కెట్

హైదరాబాద్‌లో భారత్ బయోటెక్

కణ, జన్యు చికిత్స కేంద్రం

జీనోమ్ వ్యాలీలో రూ.650 కోట్లతో ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 20: హైదరాబాద్ ఆధారిత ఔషధ రంగ దిగ్గజం భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. ఇక్కడి జీనోమ్ వ్యాలీలో దాదాపు రూ.650 కోట్లతో ఓ కణ, జన్యు చికిత్స (సీజీటీ) కేంద్రాన్ని ప్రారంభించింది. ఇది వైరల్ వెక్టర్ ప్రొడక్షన్ ఫెసిలిటీ కూడా అని గురువారం సంస్థ ప్రకటించింది. అలాగే దేశంలోనే ఇది తొలి వర్టికల్లీ ఇంటిగ్రేటెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కావడం గమనార్హం. 'సైంటిఫిక్ సవాళ్లను ఎదుర్కోవడంలో మా ఈ సెల్, జీన్ థెరపీ ఫెసిలిటీ ఓ నూతన శకానికి నాంది పలికింది' అని ఈ సందర్భంగా కంపెనీ ఓ ప్రకటనలో తెలియజేసింది. ప్రధానంగా క్యాన్సర్ వంటి జెనెటిక్ వ్యాధుల చికిత్సలో ఇక మంచి ఫలితాలు రాగలవన్న ఆశాభావాన్ని వెలిబుచ్చింది. ప్రస్తుతం జన్యు, కణ చికిత్సలు పెరిగిపోయాయని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా తెలిపారు. తమకున్న అనుభవంతో వైద్య విధానాన్ని మరింత మెరుగుపరుస్తామన్న ఆయన వైరల్ వ్యాక్సిన్ల తయారీలో తమ ప్రతిష్ఠ ఈ సీజీటీతో మరింత పెరగగలదన్న విశ్వాసాన్ని కనబర్చారు. ఆంకాలజీ, అరుదైన వ్యాధుల చికిత్సలపై తాము దృష్టి పెట్టామని, అందులో భాగంగా తెచ్చినదే ఈ సీజీటీ అని భారత్ బయోటెక్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాచెస్ ఎల్లా అన్నారు. కాగా, ఈ కేంద్రం 50 వేల చదరపు అడుగుల్లో విస్తరించి ఉన్నది.

స్టాక్ మార్కెట్‌లో నాలుగో రోజు ర్యాలీ.. 256 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..!

దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా నాలుగో రోజు ర్యాలీ కొనసాగింది. ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ నిర్ణయం తర్వాత మార్కెట్లు పుంజుకున్నాయి. సీఆర్‌ఆర్ తగ్గింపు తదితర నిర్ణయాలు మార్కెట్‌లో పెట్టుబడిదారులను ఆకర్షించాయి. ఈ క్రమంలో వారంలోని తొలిరోజైన సోమవారం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే 30-షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 82,574.55 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,369.24 పాయింట్ల కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 82,669.00 పాయింట్లకు పెరిగింది. చివరకు 256.22 పాయింట్లు పెరిగి 82,445.21 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 100.15 పాయింట్లు పెరిగి.. 25,103.20 పాయింట్ల వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,667 షేర్లు లాభపడగా.. 1,374 షేర్లు పతనమయ్యాయి. రియల్టీ మినహా అన్ని ఇతర రంగాల సూచీలు ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, పీఎస్‌యూ బ్యాంక్ ఒక్కొక్కటి ఒకశాతం వరకు పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు జంప్ చేశాయి. బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, జియో ఫైనాన్షియల్, ట్రెంట్ నిఫ్టీలో ప్రధాన లాభాలను ఆర్జించగా, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్ కంపెనీ, ఎం అండ్ ఎం, అదానీ పోర్ట్స్, ఎటర్నల్ నష్టపోయాయి. ఎస్‌ఈ– లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ మునుపటి సెషన్‌లో రూ.451.13 లక్షల కోట్ల నుంచి రూ.455.11 లక్షల కోట్లకు పెరగడంతో పెట్టుబడిదారుల సంపద రూ.3.9 లక్షల కోట్ల లక్షల కోట్లకు పెరిగింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ రికార్డు స్థాయిలో కొనసాగింది. ఇండెక్స్ 57,049.50కి చేరుకుని 0.5 శాతం లాభపడింది. గోద్రేజ్ ఇండస్ట్రీస్, మణప్పురం ఫైనాన్స్, ఎంసీఎక్స్ ఇండియా, హ్యుందాయ్ మోటార్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముత్తూట్ ఫైనాన్స్, లారస్ ల్యాబ్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, నువామా వెల్త్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, బజాజ్ ఫైనాన్స్, ఆస్ట్రాజెనెకా ఫార్మా, ఎస్‌బీఐ కార్డ్స్, సిటీ యూనియన్ బ్యాంక్, నిప్పాన్ లైఫ్, ఎల్‌టీ ఫైనాన్స్, అనుపమ్ రసాయనన్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, ఎస్‌ఆర్‌ఎఫ్ సహా 170 కంటే ఎక్కువ స్టాక్స్ బీఎస్ఈలో 52 వారాల గరిష్టాన్ని తాకాయి.

పాన్ కార్డు పోయిందా? చింతించకండి..

నిమిషాల్లో డూప్లికేట్ కోసం అప్లై చేయండి ఇలా!

పాన్ కార్డు పోగొట్టుకోవడం లేదా దొంగిలించబడటం అనేది ఈ రోజుల్లో చాలా సాధారణం అయిపోయింది. ఎన్నో ముఖ్యమైన పత్రాలతో పాటు పాన్ కార్డును కూడా ఎక్కడో పెట్టి మర్చిపోవడం లేదా అనుకోకుండా పోగొట్టుకోవడం సహజంగా జరుగుతుంది. కానీ పాన్ కార్డు లేకపోతే అనేక పనులు ఆగిపోతాయి. ముఖ్యంగా ఆర్థికపరమైన విషయాల్లో చాలా చిక్కులు ఎదురవుతాయి. అయితే మీరు అస్సలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు! పోగొట్టుకున్న పాన్ కార్డును తిరిగి పొందడం ఇప్పుడు చాలా సులభం. మీరు ఇంట్లో కూర్చొనే ఆన్‌లైన్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పాన్ కార్డు కేవలం ఒక ప్లాస్టిక్ ముక్క మాత్రమే కాదు, అది మీ గుర్తింపుకు చిహ్నం. ఈ రోజుల్లో పాన్ కార్డు ఒక ముఖ్యమైన పత్రంగా మారిపోయింది. గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలన్నా, కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాలన్నా, ఇంకా మరెన్నో ముఖ్యమైన పనులకు పాన్ కార్డు తప్పనిసరి. ఒకవేళ మీ పాన్ కార్డు పోతే, మీరు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే, పాన్ కార్డు పోగొట్టుకున్న వెంటనే డూప్లికేట్ కోసం దరఖాస్తు చేసుకోవడం చాలా ముఖ్యం. ఇప్పుడు డూప్లికేట్ పాన్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలుసుకుందాం రండి.. డూప్లికేట్ పాన్ కార్డు కోసం

దరఖాస్తు చేసుకునే విధానం: అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి: మొదటగా మీరు (నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్) అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. వెబ్‌సైట్ చిరునామాను గూగుల్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు లేదా నేరుగా వెబ్‌సైట్‌కు వెళ్లడానికి ప్రయత్నించవచ్చు. వివరాలను నమోదు చేయండి: వెబ్‌సైట్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే విభాగానికి వెళ్లండి. అక్కడ మీరు మీ పాన్ కార్డు నంబర్ (గుర్తుంటే), మీ 10 అంకెల ఆధార్ నంబర్ మరియు, మీ పుట్టిన తేదీని నమోదు చేయాలి. మీరు ఈ వివరాలను జాగ్రత్తగా , సరిగ్గా నమోదు చేయాలి.

కల్కిలో రోజుకో సర్‌ప్రైజ్

తెరమీదకు వచ్చిన మాళవికా నాయర్

కల్కి 2898 ఏడీ' చిత్రంలో పలు అతిథి పాత్రలున్నాయని, ఇంతకుముందు వైజయంతీ నెట్‌వర్క్ చిత్రాల్లో సందడి చేసిన కొందరు ఆ క్యారెక్టర్లు ప్లే చేస్తున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. దీనిపై చిత్ర బృందం ఇప్పటివరకూ స్పందించలేదు. కానీ, 'రిలీజ్ ట్రైలర్' లో ఓ హీరోయిన్‌ను చూపించి అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది. ఆమే మాళవిక నాయర్. గతంలో వైజయంతీ నెట్‌వర్క్ బ్యానర్‌లలో తెరకెక్కిన 'ఎవడే సుబ్రహ్మణ్యం', 'మహానటి'లోను ఆమె కీలక పాత్రలు పోషించి, మెప్పించారు. దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ మూడు చిత్రాల్లో ఆమె నటించడం విశేషం. అదే నెట్‌వర్క్‌లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే'లోనూ ఆమె సందడి చేశారు. ట్రైలర్‌లోని తన లుక్‌ని స్క్రీన్‌షాట్ తీసి, అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా మాళవిక ఆనందం వ్యక్తంచేశారు. వాటిని తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేస్తూ థ్యాంక్స్ చెప్పారు. కొన్ని రోజుల క్రితం విడుదలైన తొలి ట్రైలర్ ద్వారా ఈ సినిమాలో అలనాటి హీరోయిన్ శోభన ఉన్నారని తెలిసింది. ఆ తర్వాత చిత్ర బృందం అధికారికంగా ప్రకటిస్తూ ఆమె లుక్‌ని షేర్ చేసింది. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారని రూమర్స్ వచ్చాయి. నాగ్ అశ్విన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఎన్నో సర్‌ప్రైజ్ లుంటాయని తెలిపారు. మరి, ఆయన ఈ రోల్స్ గురించే చెప్పారా, వేరే దాని గురించా? అంటే వేచి చూడాల్సిందే. ప్రభాస్ హీరోగా రూపొందిన ఈ సైన్స్ ఫిక్షన్ మూవీలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్ర ప్రసాద్, దీపికా పదుకొణె, దిశా పటానీ కీలక పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే. కాశీ, కాంప్లెక్స్, శంబల అనే మూడు ప్రపంచాల చుట్టూ తిరిగే కథతో తెరకెక్కిన ఈ సినిమా ఈనెల 27న విడుదల కానుంది.

సోనాక్షి ఇంట పెళ్లి సందడి

బాలీవుడ్ నటులు సోనాక్షి సిన్హా జహీర్ ఇక్బాల్ పెళ్లి చేసుకోబోతున్నారంటూ ఇటీవల జోరుగా ప్రచారం సాగిన సంగతి తెలిసిందే. ఆ రూమర్స్‌పై ఇద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. బాలీవుడ్ వర్గాల సమాచారం మేరకు.. సోనాక్షి- ఇక్బాల్‌ల వివాహం ఆదివారం జరగనుందని తెలిసింది. ఈ నేపథ్యంలో ముంబయిలోని సోనాక్షి ఇంట నిర్వహించిన మెహందీ వేడుక ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఆ ఫంక్షన్‌కు ఇరు కుటుంబాలు, కొద్దిమంది అతిథులు హాజరైనట్టు సమాచారం. 'డబుల్ ఎక్స్‌ఎల్' సినిమాలో కలిసి నటించిన ఇక్బాల్, సోనాక్షిల మధ్య స్నేహం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారింది. తన కుమార్తె వివాహంపై వచ్చిన వార్తలపై ఇటీవల నటుడు శత్రుఘ్న సిన్హా స్పందించారు. 'ఇది నా ఒక్కగానొక్క కుమార్తె జీవితం. ఆమె అంటే నాకు అమితమైన ప్రేమ. నేనే తన బలం అని ఆమె ఎన్నోసార్లు చెప్పింది. తప్పకుండా తన పెళ్లికి వెళ్తా అని తెలిపారు. అంతకుముందు ఓ సందర్భంలో స్పందిస్తూ.. సోనాక్షి- ఇక్బాల్‌ల ప్రయాణం గురించి తనకేమీ తెలియదనడం గమనార్హం.

కల్కిలో విజయ్ దేవరకొండ కూడా ఉన్నాడా ?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం కల్కి. ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ఇంకా 5 రోజులే ఉండడంతో ప్రమోషన్స్ గట్టిగా చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా ఆకట్టుకున్నాయి. ఇదిలావుంటే శు క్రవారం రిలీజ్ ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అయితే ఈ కొత్త ట్రైలర్‌లో మాళవికనాయర్‌ను చూపించి సర్‌ప్రైజ్ ఇచ్చారు మేకర్స్. ఇప్పుడు తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక సాలిడ్ రూమర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ నటిస్తున్నట్లు తెలుస్తుంది. అశ్వథామ(కుంజరం)ను ఎదుర్కొనే పాత్రలో విజయ్ కనిపించబోతున్నట్లు నెట్టింట వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై మేకర్స్ ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు.

రామోజీలో అనుష్క ఘాటి మూవీ షూటింగ్

కథానాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు కేరాఫ్ స్వీటీ అనుష్క. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా బలమైన పాత్రలు, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలతో మెప్పించి తెలుగునాట అద్భుతమైన గుర్తింపు పొందారు. గత ఏడాది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. తాజాగా క్రిష్ దర్శకత్వంలో ఆమె 'ఘాటి' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది.అనుష్క, విక్రమ్ తదితరులపై మార్కెట్ నేపథ్యంలో సాగే పాటను చిత్రీకరిస్తున్నారు. రాజు సుందరం నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. అంతే కాదు కీలక సన్నివేశాల చిత్రీకరణకు కూడా దర్శకుడు ఎ÷–లాన చేస్తున్నారు. ఇటీవలే 'కథనార్..' చిత్రంతో మలయాళంలోకి అడుగుపెట్టింది అనుష్క. ఈ సినిమా కూడా చిత్రీకరణ దశలో ఉంది.

నక్కిన దర్శకత్వంలో సందీప్ కిషన్

దర్శకుడు నక్కిన త్రినాథ రావు, రచయిత బెజవాడ ప్రసన్న కుమార్ మళ్ళీ చేతులు కలిపి ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తుండగా, ఇంకొక ప్రధాన పాత్రలో రావు రమేష్ నటిస్తున్నారు. రీతు వర్మ, అన్ను అంబానీ లు సందీప్, రావు రమేష్ పక్కన జోడీగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఇప్పుడు హైదరాబాదులో అవుతోంది. ఇందులో సందీప్ కిషన్, రీతు వర్మ, అన్ను అంబానీ, ఇంకా మరికొంతమంది ఆర్టిస్టులు వున్నారని కూడా తెలిసింది. అయితే ఈ సినిమాకి ఇంతవరకు ఎటువంటి టైటిల్ పెట్టలేదు, ఈ సినిమా అధికారికంగా ప్రకటించినప్పుడు కేవలం ÷ూఐ30 అని మాత్రమే అన్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమాకి టైటిల్ ఖరారు అయినట్టుగా తెలుస్తోంది. ఇంతకు ముందు నక్కిన త్రినాథ రావు, రవి తేజ కాంబినేషన్ లో 'ధమాకా' సినిమా విజయవంతమై రూ.100 కోట్లకి పైగా కలెక్టు చేసిందని తెలుసు కదా. ఇప్పుడు ఈ సందీప్ కిషన్ సినిమాకి కూడా అలాంటి టైటిల్ ఉంటే బాగుంటుంది అని నక్కిన త్రినాథ రావు, బెజవాడ ప్రసన్న కుమార్ ఇద్దరూ అనుకున్నారు. అందుకే ఈ సినిమాకి 'మజాకా' అని టైటిల్ పెడుతున్నట్టుగా తెలిసింది. ఈ విషయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు, కానీ కొన్ని రోజుల్లో ఈ సినిమా టైటిల్ రివీల్ చెయ్యొచ్చు అని తెలిసింది.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056